

TELTEL/2021/81472

# ప్రభ

దినపత్రిక

ప్రజ శ్రేయస్సే - ప్రభ లక్ష్యం


**విలేకరులు కావలెను**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా ప్రభ దినపత్రికలో బ్యూరో, మండలలా రిపోర్టర్‌గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయుల్లో ఉత్సహావంతులైన యువతి,యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.


ప్రభ సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 9642555562



ఎడిటర్ -బైరోజు కిషోర్ చారి | తెలంగాణ ,ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి - 4 | సంచిక- 240 | శనివారం | 08 -11-2025 | పేజీలు- 8 | వెల రూ. 5


## సీఎం రేవంత్‌వి బ్లాక్ మెయిల్ రాజకీయాలు

- ఓటర్లను బెదిరించే ధోరణిలో ప్రసంగాలు
- ఓట్లు వేయకుంటే రేషన్ కార్డులు ఇవ్వమనడం దారుణం
- మండిపడ్డ మాజీమంత్రి హరీష్ రావు



**హైదరాబాద్, -నవంబర్ -07 ప్రభ**

బ్లాక్ మెయిల్ చేసి జూబ్లీహిల్స్‌లో ఓట్లు వేయించుకోవాలని సిఎం రేవంత్ చూస్తున్నారని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేయకుంటే.. రేషన్ కార్డులు ఆగిపోతాయంటున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి అయ్య జాగీరా? రేవంత్ ఇంట్లో నుంచి ఇస్తున్నారా అంటూ ఫైర్ అయ్యారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిలర్ అంటూ కామెంట్స్ చేశారు.

-మిగతా 2 లో




## సంకల్పబలం... వందేమాతరం

- వందేమాతరం గీతం కొత్త స్ఫూర్తిని ఇస్తుంది
- వందేమాతరం అంటే ఓ పదం, ఓ మంత్రం, ఓ శక్తి, ఓ కళ, ఓ పట్టుదల
- 1937లో వందేమాతరం గేయంలో కొన్ని చరణాలను తొలగించారు
- వందేమాతరం సంస్మరణ ఉత్సవంలో ప్రధాని మోదీ


**న్యూఢిల్లీ: -నవంబర్ -07 ప్రభ**

వందేమాతం జాతీయ గీతానికి 150 ఏళ్లు నిండాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంస్మరణ ఉత్సవంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో మోదీ మాట్లాడుతూ.. వందే మాతరం గీతంలోని కొన్ని ముఖ్యమైన చరణాలను 1937లో తొలగించినట్లు ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీని టార్గెట్ చేస్తూ మోదీ ఆ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. విభజనకు చెందిన కొన్ని చరణాలను ఆ గేయం నుంచి తొలగించారని, ఇప్పటికీ లాంటి విభజన మైండ్‌సెట్ దేశానికి సవాల్‌గా మారిందని ప్రధాని మోదీ అన్నారు. ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో వందేమాతరం 150 ఏళ్లకు చెందిన సంస్మరణ స్టాంపు, నాణాన్ని ప్రధాని రిలీజ్ చేశారు.భారత స్వాతంత్ర్య ఉద్యమంలో

-మిగతా 2 లో

## జూబ్లీ గెలుపుపై ఎవరి ధీమా వారిదే

- సర్వేలపైనా పలు పార్టీల నజర్



2 లో

## ప్రపంచ కుబేరుడు ఎలన్ మస్క్ జీతం ట్రిలియన్ డాలర్లు ..

- ఆమోదం తెలిపిన టెస్లా కంపెనీ షేర్‌హోల్డర్లు

**లాస్ ఏంజిల్స్ -నవంబర్ -07 ప్రభ**

కార్పొరేట్ చరిత్రలోనే ఎలన్ మస్క్ సంచలనం సృష్టించారు. అత్యధిక జీతం అందుకుంటున్న సీఈవోగా ఆయన రికార్డు క్రియేట్ చేశారు. జీతం కింద మస్క్‌కు ట్రిలియన్ డాలర్లు ఇచ్చేందుకు టెస్లా కంపెనీ షేర్‌హోల్డర్లు ఆమోదించారు. దీంతో పే ప్యాకేజీలో కొత్త రికార్డు క్రియేట్ అయ్యింది. కంపెనీకి చెందిన షేర్‌హోల్డర్లలో 75 శాతం ఓట్లు ఆయనకు అనుకూలంగా వచ్చాయి. వార్షిక కంపెనీ మీటింగ్‌లో మస్క్ జీతంపై నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే ప్రపంచ కుబేరుడైన మస్క్.. ఇప్పుడు తన సంపదను మరింత పెంచుకోనున్నారు. అయితే రాబోయే పదేళ్లలో ఎలక్ట్రిక్ కార్ల



-మిగతా 2 లో

# ప్రైవేట్ విద్యాసంస్థల తాట తీస్తా

## విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటారా

- బంద్ పెట్టి బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తానంటే ఎలా
- విద్యార్థుల అకడమిక్ ఇయర్ లాస్‌కు ఎవరు బాధ్యులు
- ఫీజులు ఇష్టానుసారం పెంచి రియంబర్స్‌మెంట్‌పై ఒత్తిడి
- రాజకీయ పార్టీల ఉచ్చులో పడి బెదిరిస్తే ఊరుకునేది లేదు
- ప్రైవేట్ విద్యాసంస్థల తీరుపై సీఎం రేవంత్ ఘాటు హెచ్చరికలు



**హైదరాబాద్, -నవంబర్ -07 ప్రభ**

ప్రైవేటు విద్యాసంస్థల నిర్వాహకులు తమాషా చేస్తే తాటతీస్తానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటే ఊరుకునేది లేదని వార్నింగ్ ఇచ్చారు. విద్య అనేది సేవ.. వ్యాపారం కాదని స్పష్టం చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థలు సేవ చేయడం లేదు.. వ్యాపారం చేస్తున్నాయని సీరియస్ అయ్యారు. శుక్రవారం గాంధీభవన్ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. విద్యార్థులకు నష్టం కలిగిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఫీజు రీయంబర్స్ మెంట్‌పై ప్రైవేటు విద్యాసంస్థలు బ్లాక్‌మెయిల్ చేస్తున్నాయని ధ్వజమెత్తారు. కాలేజీలను బంద్ చేయించిన

-మిగతా 2 లో

## 2026లో భారత్ లో పర్యటిస్తా



- ప్రధాని మోదీ గొప్ప వ్యక్తి, నా మిత్రుడు
- వాణిజ్య సంబంధాలను పటిష్టం చేస్తా
- డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ,**

అమెరికా- భారత్ మధ్య టారిఫ్ ఉద్రిక్తతలు నెలకొన్న వేళ ప్రధాని నరేంద్ర మోదీని ఉద్దేశించి అగ్రరాజ్యం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ గొప్ప వ్యక్తి, తన మిత్రుడు అంటూ కొనియాడారు. అలాగే, ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలను పటిష్టం చేసే ప్రయత్నాల్లో భాగంగా, వచ్చే ఏడాది తాను భారత్‌ను సందర్శించే అవకాశం ఉందని ట్రంప్ ప్రకటించారు. వైట్‌హౌస్‌లో ట్రంప్ విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా భారత్‌తో వాణిజ్య చర్చలపై విలేకరులు ప్రశ్నలు అడిగారు. ఈ క్రమంలో మోదీతో తన చర్చలు అద్భుతంగా సాగుతున్నాయని ట్రంప్ సమాధానం చెప్పారు. ప్రధాని మోదీ రష్యా నుంచి ఇంధన కొనుగోలును చాలా వరకు ఆపేశారు. ఆయన నాకు మిత్రుడు, మేము మాట్లాడుతుంటాం. మోదీ గొప్ప వ్యక్తి. ఆయన నాకు మిత్రుడు, ఆయన నన్ను అక్కడికి రావాలని ఆహ్వానించారు. నేను తప్పకుండా వెళతాను. పర్యటనను ఖరారు చేస్తామని అన్నారు. తాను భారత్‌కు వెళతానని ట్రంప్ చెప్పిన నేపథ్యంలో వచ్చే ఏడాది వెళ్లే అవకాశం ఉందా?

-మిగతా 2 లో



# హైదరాబాద్ అభివృద్ధికి ఆ ఇద్దరే అడ్డంకి

**బ్యాడ్ బ్రదర్స్ ఇద్దరు అభివృద్ధికి మోకాలడ్డు**



## ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ హయాంలోనే నగరాభివృద్ధి

- హైదరాబాద్‌ను డ్రగ్స్‌కు అడ్డాగా చేసిన కేటీఆర్
- మూసీ పునరుద్ధరణ, మెట్రో పొగింపులకు కిషన్ రెడ్డి అడ్డు
- నగరంలో 44 చెరువులను కబ్జా చేసిన బీఆర్ఎస్ నేతలు
- జూబ్లీహిల్స్‌లో బీజేపీకి డిపాజిట్ కూడా రాదు
- ఎన్నిక ఏదైనా తానే రంగంలో ఉన్నట్లుగా భావిస్తా
- ఓట్లు వేసి గెలిపిస్తే నగరాభివృద్ధికి పెద్దపీట
- మీడియా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,-నవంబర్ -07 (పభ**

రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే హైదరాబాద్ ఎక్కువగా అభివృద్ధి చెందిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి ఎపిలో 2004-2014 మధ్య కాలంలోనే రాష్ట్రంలో అభివృద్ధి అన్నది కనిపించిందన్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓఆర్ఆర్, శంషాబాద్ విమానాశ్రయం, మెట్రో రైలు.. ఇవన్నీ కాంగ్రెస్ ప్రభుత్వమే తీసుకువచ్చిందన్నారు. 2014 నుంచి కేంద్రంలోని భాజపా, రాష్ట్రంలోని భారత రాష్ట్ర సమితి.. రాష్ట్రానికి చేసింది శూన్యం. హైదరాబాద్‌లో ఎలాంటి అభివృద్ధి జరగలేదు. 2014లో రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో తెలంగాణ

-మిగతా 2 లో

## రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

- పంట నష్టపోయిన కౌలు రైతులకు పెట్టుబడి సాయం
- సకాంలో బీమా ప్రీమియం చెల్లించి రైతులను ఆదుకున్నాం
- పంటలకు గిట్టుబాటు ధరలు వచ్చేలా ప్రత్యేక చర్యలు
- పంటలకు ఇబ్బంది లేకుండా సాగునీటి సరఫరా
- రాయలసీమ ప్రాజెక్టులను పూర్తి చేసేలా చర్యలు
- కరువును శాశ్వతంగా తరిమేలా ప్రణాళికలు
- ఆచార్య ఎన్‌జి రంగా జయంతి వేడుకల్లో సీఎం చంద్రబాబు



**గుంటూరు, -నవంబర్ -07 (పభ**

రాష్ట్రంలో ఏ ఒక్క రైతూ అధైర్యపడొద్దు.. ఆత్మహత్యలు చేసుకోవద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. తుఫాను ప్రభావంతో పంటలు నష్టపోయిన కౌలు రైతులకు పెట్టుబడి రాయితీ ఇస్తున్నామని తెలిపారు. పంటల బీమా ప్రీమియం కూడా జగన్ ప్రభుత్వం చెల్లించలేదని ధ్వజమెత్తారు. దీంతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వంలో ప్రీమియం సకాలంలో చెల్లించామని స్పష్టం చేశారు సీఎం చంద్రబాబు. ఆచార్య ఎన్జీరంగా 125వ జయంతి ఉత్సవాల్లో సీఎం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రైతును ఆదుకునేందుకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. మొన్నటి తుపానులో

-మిగతా 2 లో

## ఆఫ్ఘన్-పాక్ సరిహద్దులో కాల్పుల మోత..

- ఆఫ్ఘనిస్థాన్ వైపు నుంచే కాల్పులు ప్రారంభమయ్యాయి.
- ఐదుగురు ఆఫ్ఘన్ పౌరుల మృతి
- పాకిస్థాన్ సమాచార మంత్రిత్వ శాఖ స్పష్టం

**కాందహార్ ప్రావిన్స్,**

ఆఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్ మధ్య సరిహద్దు ఉద్రిక్తతలు మరోసారి భగ్గుమన్నాయి. ఇరు దేశాల మధ్య శాంతి చర్చలు జరుగుతున్న తరుణంలోనే గురువారం సరిహద్దుల్లో కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో ఐదుగురు ఆఫ్ఘన్ పౌరులు మరణించగా, మరో ఆరుగురు గాయపడ్డారు. ఈ కాల్పులకు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ ఇరు దేశాలు ప్రకటనలు విడుదల చేశాయి. ఆఫ్ఘనిస్థాన్‌లోని కాందహార్ ప్రావిన్స్‌కు చెందిన స్పిన్ బోల్డాక్ జిల్లా ఆసుపత్రి అధికారి ఈ వివరాలను వెల్లడించారు. మృతుల్లో నలుగురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నట్లు ఆయన తెలిపారు. పాకిస్థాన్ వైపు ప్రాణనష్టంపై తక్షణ సమాచారం అందుబాటులో లేదు. టర్కీలోని ఇస్తాంబుల్‌లో పాకిస్థాన్‌తో మూడో విడత చర్చలు ప్రారంభమైన సమయంలోనే పాక్ దళాలు తమపై కాల్పులు జరిపాయని తాలిబన్ ప్రభుత్వ అధికార ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ ఆరోపించారు. "చర్చల బృందానికి గౌరవం ఇచ్చి, పౌర నష్టాన్ని నివారించేందుకు మా దళాలు సంయమనం




-మిగతా 2 లో

## ఫీజు రియంబర్స్‌మెంట్ ఎత్తేసే కుట్ర

- రేవంత్ వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం
- బకాయిలు చెల్లించకుంటే చదువెలా సాగిస్తారు
- ప్రైవేట్ కాలేజీలకు మా మద్దతు కొనసాగిస్తాం
- కేంద్రమంత్రి బండి సంజయ్ వెల్లడి

**హైదరాబాద్, -నవంబర్ -07 (పభ**

ఫీజు రియంబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తేసే కుట్రలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నారని, కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు అడిగితే.. ప్రైవేట్ కాలేజీ యజమాన్యాలని సీఎం రేవంత్‌రెడ్డి బ్లాక్‌మెయిల్ చేస్తారా..? అని ఫైర్ అయ్యారంటే అరథం చేసుకోవచ్చున్నారు. అసెంబ్లీ సాక్షిగా ప్రతినెలా బకాయిలు చెల్లిస్తానని సీఎం రేవంత్‌రెడ్డి మాట ఇచ్చింది నిజం కాదా..? అని ప్రశ్నించారు.




-మిగతా 2 లో

## ప్రపంచ కుబేరుడు ఎలన్ మస్క్ జీతం ట్రిలియన్ డాలర్లు

(మొదటి తరువాయి)

కంపెనీ టెస్లా మార్కెట్ వాల్యూ ఆయన మరింత పెంచాల్సి ఉంటుంది. ఒకవేళ షేర్‌హోల్డర్లు అనుకున్నట్లు మస్క్ తన లక్ష్యాలను సాధిస్తే, అప్పుడు ఆయనకు లక్షల సంఖ్యలో షేర్లు కలిసిరానున్నాయి.మరీ భారీగా జీతాన్ని ఇవ్వడం పట్ల విమర్శలు వచ్చాయి. కానీ టెస్లా బోర్డు మాత్రం సీఈవో మస్క్‌కు అండగా నిలిచింది. ఒకవేళ ఆయన జీతాన్ని ఆమోదించకుంటే, అప్పుడు ఆయన ఈ కంపెనీ వదిలి వెళ్లే అవకాశాలు ఉన్నట్లు బోర్డు భయాందోళనకు గురైంది. ప్రస్తుతం ఉన్న దశలో మస్క్‌ను వదులుకోలేమని టెస్లా బోర్డు చెప్పింది. టెక్సాస్‌లోని ఆస్టిన్‌లో ఉన్న మస్క్ తన జీతం విషయం తెలియగానే ఆయన సంతోషాన్ని ఆపుకోలేకపోయారు. టెస్లాలో ఇది కొత్త అధ్యాయం మాత్రమే కాదు, ఇదో కొత్త చరిత్ర అవుతుందన్నారు.మస్క్‌కు ట్రిలియన్ డాలర్ల పే ప్యాకేజీ అందాలంటే ఆయన ముందు కొన్ని టార్గెట్లను పూర్తి చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం టెస్లా మార్కెట్ విలువ 1.4 ట్రిలియన్ల డాలర్లుగా ఉన్నది. అయితే ఆ మార్కెట్ విలువను ఆయన 8.5 ట్రిలియన్ డాలర్లకు చేర్చాల్సి ఉంటుంది. స్వీయ డ్రైవింగ్ చేస్తున్న లక్షల సంఖ్యలో రోబోట్యాక్సీ వాహనాలను ఆయన కమర్షియల్ ఆపరేషన్‌లోకి తీసుకురావాల్సి ఉంటుంది. ఒకవేళ అన్నీ అనుకుట్లే సాగితే, ప్రపంచ కుబేరుడు మస్క్ ప్రపంచంలోనే తొట్టతొలి ట్రిలియనీర్ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

## జుబ్లీ గెలుపుపై ఎవరి ధీమా వారిదే

### సర్వేలపైనా పలు పార్టీల నజర్




హైదరాబాద్

గ్రేటర్ హైదరాబాదులోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి మరో వారం రోజుల్లో ఉప ఎన్నిక జరుగుతోంది. ప్రస్తుతం బరిలో ఉన్న అన్ని ప్రధాన పార్టీల్లోనూ గెలుపుపై తీవ్రమైన సస్పెన్స్ కొనసాగుతోంది. ఎవరికి వారు గెలుపు గుర్రంపై ధీమా వ్యక్తం చేస్తున్నా అంతర్గత చర్చల్లో మాత్రం ప్రత్యర్థుల ఎత్తులపై చర్చలు వేస్తున్నారు. వారి కంటే మనం బాగా ప్రచారం చేస్తున్నామా ఎక్కడెక్కడ ? ముందు ఉన్నాం ఏ ఏ అంశాల్లో వెనుకబడి ఉన్నాం అనేదానిపై రకరకాల సర్వేలు చేస్తున్నారు. ఇప్పటివరకు జరిగిన ప్రచారాన్ని భేరీజు వేసుకుంటున్నారు. ఈ క్రమంలోని బిఆర్ఎస్ - కాంగ్రెస్ వర్గాలు సర్వేలను ఆధారం చేసుకుని గెలుపు తమది అంటూ ప్రచారం చేసుకోవడం ఒక అంశం అయితే .. ఈ ఉప ఎన్నికల్లో గెలుపు ఆధారంగా ఆయా పార్టీలు తమ నాయకులకు పదవులు ఇచ్చే అంశాన్ని కూడా పరిశీలిస్తూ ఉండటం విశేషం. కాంగ్రెస్ పార్టీ నుంచి మంత్రి పదవులు ఆశించిన వారు .. నామినేటెడ్ పదవులు ఆశించిన వారు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో ఆ పార్టీని గెలిపించేందుకు గట్టిగా కష్టపడుతున్నారు. ఇక బిఆర్ఎస్ లోను ఇదే తరహా ప్రచారం జరుగుతోంది. పార్టీ పదవుల కోసం ఆశలు పెట్టుకున్న వారు ... వచ్చే ఎన్నికల్లో టికెట్లు ఆశిస్తున్న వారు కేసీఆర్ దగ్గర మంచి మార్కుల కోసం .. కేటీఆర్ దగ్గర మంచి మార్కుల కోసం గట్టిగా కష్టపడుతున్నారు. ఉప ఎన్నికల్లో తమ సత్తా చాటాలని ప్రయత్నాలు చేస్తున్నారు. మరి వీరిలో ఎవరి ఆశలు నెరవేరుతాయో చూడాలి.

## సంకల్పబలం... వందేమాతరం

(మొదటి తరువాయి)

వందేమాతరం ఈ దేశ స్వరంగా మారిందన్నారు. ప్రతి భారతీయుడి తమ మనోభావాలను ఆ గేయం ద్వార వ్యక్తపరిచారన్నారు. కానీ 1937లో దురదృష్టవశాత్తు, వందేమాతరం గేయంలోని కొన్ని చరణాలను తొలగించారని, వందేమాతర గీత విభజన దేశ విభజనకు బీజం వేసిందన్నారు. జాతి నిర్మాణం కోసం రూపొందించిన ఈ మహామంత్రం పట్ల ఎందుకు అన్యాయం జరిగిందో ఈ తరం యువత తెలుసుకోవాలన్నారు. ఇలాంటి విచ్ఛిన్నకర మైండ్‌సెట్ దేశానికి ఇప్పటికీ సవాలే అన్నారు. ఉగ్రవాదం పేరుతో శత్రువులు మన భద్రత, గౌరవంపై దాడి చేస్తే, అప్పుడు భారత్ ఎలా దుర్గ అవతారాన్ని ఎత్తిందో ప్రపంచ వీక్షించినట్లు పేర్కొన్నారు. వందేమాతర గీతం కొత్త స్ఫూర్తిని ఇస్తుందని, ఈ దేశాన్ని కొత్త శక్తితో నింపుతోందన్నారు. వందేమాతరం అంటే ఓ పదం, ఓ మంత్రం, ఓ శక్తి, ఓ కళ, ఓ పట్టుదల అని ఆయన అన్నారు. భారతమాత పట్ల ఇది భక్తికి నిదర్శనమన్నారు. మన చరిత్రను చాటుతూ.. మనకు కొత్త ఉత్తేజాన్ని ఇస్తుందన్నారు. అనుకున్నది సాధించలేనిది ఏమీ లేదని, భారతీయులు దేన్నైనా సాధించగలరని, జ్ఞానం..విజ్ఞానం.. సాంకేతిక నిండిన దేశాన్నినిర్మించాలన్నారు.

## 2026లో భారత్ లో పర్యటిస్తా

(మొదటి తరువాయి)

అని విలేకరులు అడిగారు. దీనికి ట్రంప్ బదిలిస్తూ ' అవును, వచ్చే ఏడాది ఉండొచ్చు' అని సమాధానం చెప్పారు. వాస్తవానికి భారత్?లో జరగాల్సిన క్వాడ్ మీటింగ్‌కు ట్రంప్ రావాల్సి ఉంది. అయితే ట్రంప్ ఇకపై క్వాడ్ సమ్మిట్ కోసం భారత్‌కి రాకపోవచ్చని అన్నారు. ఈ ఏడాది ఆగస్టులో ఒక వ్యాసంలో పేర్కొంది. భారత్‌తో వాణిజ్య సుంకాల (టారిఫ్) వివాదాల నేపథ్యంలో ఆ ప్రయాణాన్ని వాయిదా వేసినట్లు ఆ రిపోర్ట్ తెలియజేసింది. అయితే ట్రంప్ తాజాగా చేసిన వ్యాఖ్యలు రెండు దేశాల మధ్య సంబంధాలు మళ్లీ సానుకూల దిశలో సాగుతున్నాయనే సంకేతంగా భావించవచ్చు. ప్రస్తుతం భారత్ - అమెరికా మధ్య వాణిజ్య చర్చలు కీలక దశలో ఉన్నాయి. ఈ క్రమంలో ట్రంప్ నుంచి ఇలాంటి కామెంట్స్ రావడం ప్రాధాన్యత సంతరించుకొన్నది. రష్యా చమురును భారత్ కొనుగోలు చేస్తున్న నేపథ్యంలో అమెరికా అదనంగా 25 శాతం సుంకాలని విధించిన విషయం తెలిసిందే. ఉక్రెయిన్‌తో యుద్ధం నేపథ్యంలో రష్యాను ఆర్థికంగా ఒంటరి చేయాలని భారత్‌పై ట్రంప్ అదనపు సుంకాలను విధించారు. అయితే, తాజాగా భారత్ రష్యా నుంచి ఇంధన కొనుగోళ్లను తగ్గించుకోవాలని నిర్ణయించినట్లు ఇటీవల ట్రంప్ స్వయంగా ప్రకటించారు. అంతేకాకుండా, ఆగిపోయిన వాణిజ్య చర్చలు కూడా ఫలప్రదంగా సాగుతున్నట్లు వెల్లడించారు. దీపావళి రోజు కూడా మోదీకి కాల్ చేసి ట్రంప్ శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు రష్యా చమురు కొనుగోలు, వాణిజ్యంపై చర్చించినట్లు ట్రంప్ మరోసారి పునరుద్ఘాటించారు. వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ కూడా దీనిపై క్లారిటీ ఇచ్చారు. అధ్యక్షుడు ట్రంప్ భారత్-అమెరికా సంబంధాలపై సానుకూలంగా ఉన్నారని, వైట్‌హౌస్‌లో జరిగిన దీపావళి వేడుకల సందర్భంగా ప్రధాని మోదీతో నేరుగా మాట్లాడారని ధృవీకరించారు.

## ఆఫ్ఘన్-పాక్ సరిహద్దులో కాల్పుల మోత..

(మొదటి తరువాయి)

పాటిస్తున్నాయి" అని ఆయన 'ఎక్స్'లో పేర్కొన్నారు. అయితే ఈ ఆరోపణలను పాకిస్థాన్ తీవ్రంగా ఖండించింది. "ఆఫ్ఘన్ వైపు నుంచి వచ్చిన ఆరోపణలను మేము తోసిపుచ్చుతున్నాం. ఆఫ్ఘనిస్థాన్ వైపు నుంచే కాల్పులు ప్రారంభమయ్యాయి. మా భద్రతా దళాలు బాధ్యతాయుతంగా, పరిమితంగా స్పందించాయి" అని పాకిస్థాన్ సమాచార మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. కాల్పులు సుమారు 10 నుంచి 15 నిమిషాల పాటు జరిగినట్లు స్థానిక అధికారులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోకి వచ్చిందని, కాల్పుల విరమణ అమలులో ఉందని పాకిస్థాన్ ధ్రువీకరించింది. ఇరు దేశాల మధ్య ఘర్షణలను నివారించేందుకు టర్కీ వేదికగా శాంతి చర్చలు జరుగుతున్నాయి. అయితే కాల్పుల విరమణ ఒప్పందంపై తుది నిర్ణయం తీసుకోవడంలో గత వారం చర్చలు ప్రతిష్ఠంభనలో పడ్డాయి.

# హైదరాబాద్ అభివృద్ధికి ఆ ఇద్దరే అడ్డంకి

(మొదటి తరువాయి)

రాష్ట్రం ఏర్పడింది. 2023లో కేసీఆర్ తెలంగాణను రూ.8లక్షల కోట్ల అప్పుల్లో పెట్టి మళ్లీ కాంగ్రెస్‌కు అప్పగించారు. హైదరాబాద్‌కు యూపీఏ ప్రభుత్వం ఇచ్చిన ఐటీఐఆర్‌ను రద్దు చేసింది ఎవరని అన్నారు. ఐటీఐఆర్ కూడా మంజూరు చేసి ఉంటే రాష్ట్రం మరింత అభివృద్ధి చెంది ఉండేదని అన్నారు. వరదలు వచ్చి హైదరాబాద్ మునిగిపోతే కేంద్రం చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కేంద్రం నుంచి వరద సాయంగా రూపాయి కూడా తేలేదని అన్నారు. హైదరాబాద్‌లో 44 చెరువులను భారత రాష్ట్ర సమితి నేతలు కబ్జా చేశారు. అంబర్‌పేటలో బతుకమ్మకుంటను ఆ పార్టీ అంబర్‌పేట ఇన్‌ఛార్జి ఎడ్ల సుధాకర్‌రెడ్డి ఆక్రమించారు. చెరువుల్లోని కబ్జాలను తొలగించి పునరుద్ధరిస్తే.. దానిపై రాజకీయం చేస్తున్నారు. అహ్మదాబాద్‌లో సబర్మతి ప్రక్షాళన చేసుకున్నారు.. యూపీలో నది ప్రక్షాళన చేశారు. అహ్మదాబాద్‌లో కొత్త నగరం కట్టుకున్నారు.. తెలంగాణలో అడ్డుకుంటున్నారు. గతంలో కాంగ్రెస్ వల్లే నగరం అభివృద్ధి చెందింది. ఇప్పుడూ కాంగ్రెస్‌ను గెలిపిస్తే అభివృద్ధి పనులు జరుగుతాయి. అభివృద్ధి పనుల వల్ల పేదలకు నష్టం జరిగితే ఆదుకుంటాం. ఇళ్లు కోల్పోయిన పేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తాం. ప్రజలను ఓటు అడుగుతున్నా.. మీ ఓటు ద్వారా హైదరాబాద్‌ను అభివృద్ధి చేసుకుందాం అని సీఎం విజ్ఞప్తి చేశారు. భారత రాష్ట్ర సమితి హయాంలో కాళేశ్వరం, కమాండ్ కంట్రోల్ సెంటర్, సచివాలయం, ప్రగతి భవన్ నిర్మించారు. కుమారుడిని ముఖ్యమంత్రిని చేయాలని, వాస్తు సరిగా లేదని బాగున్న సచివాలయాన్ని కూలగొట్టి.. కొత్తది నిర్మించారు. పేద ప్రజలకు ఆ సచివాలయం వల్ల ఏమైనా ఉపయోగం ఉందా? కొత్త ఉద్యోగాలు ఏమైనా వచ్చాయా? అంటూ ప్రశ్నించారు. ప్రతిపక్షాలు, మీడియా ప్రతినిధులపై నిఘా పెట్టేందుకు కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఎవరికీ అనుమతి లేని



విలాసవంతమైన భవనాలు మాత్రమే నిర్మించారు. రైతు కోసమని కట్టిన కాళేశ్వరం మాత్రం మూడేళ్లకే కూలింది. పదేళ్లలో మెట్రో రైలును కొత్తగా కిలోమీటరు కూడా పొడిగించలేదు. మంజూరైన పాతబస్తీ మెట్రోను కూడా పక్కకు పెట్టారు. మెట్రో నిర్మించిన ఎల్ అండ్‌టీ నష్టాలకు కూడా భారత రాష్ట్ర సమితే కారణం అని సిఎం అన్నారు. 2047 నాటికి స్వాతంత్య్రం వచ్చి వందేళ్లు కావస్తోంది. భవిష్యత్ ప్రణాళికలు ఎలా ఉండాలో విజన్ డాక్యుమెంట్ తయారు చేస్తున్నాం. మెట్రో విస్తరణకు రూ.43వేల కోట్లతో ప్రణాళికలు కేంద్రానికి ఇచ్చాం. ఆనాడు హైదరాబాద్ అభివృద్ధి కోసం కొట్లాడిన శశిధర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డిని హైదరాబాద్ బ్రదర్స్ అనే వాళ్లు. నేడు హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకుంటున్న కిషన్‌రెడ్డి, కేటీఆర్‌ను బ్యాడ్ బ్రదర్స్ అంటున్నారు. వీరిద్దరూ కలిసి మెట్రో విస్తరణ, మూసీ ప్రక్షాళన, రీజినల్ రింగ్ రోడ్డు, ఫ్యూచర్‌సిటీని అడ్డుకుంటున్నారు. గోదావరి జలాలు 20 టీఎంసీలు హైదరాబాద్ నగరానికి తేవాలని ప్రయత్నిస్తుంటే అడ్డుకుంటున్నారు. హైదరాబాద్‌లో నిర్మించాలనుకున్న ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్లకు అడ్డంకులు సృష్టిస్తున్నారు. 30 ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న కంటోన్మెంట్ నుంచి శామీర్‌పేట, మేడ్చల్‌కు ఎలివేటెడ్ కారిడార్లకు అప్రూవల్ తెచ్చి రూ.5వేల కోట్లతో పనులు ప్రారంభించాం. ఉత్తర తెలంగాణ మొత్తం ఈ రెండు ఎలివేటెడ్ కారిడార్లపైనే ఆధారపడి ఉంది. పదేళ్లు అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితి.. వాటి అనుమతులకు ప్రయత్నం చేయలేదని అన్నారు. వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాల నిర్మాణానికి అనుమతులు తీసుకొచ్చాం. అదనంగా కొత్తగూడెం, రామగుండం ఎయిర్‌పోర్టులకు ప్రయత్నాలు చేస్తున్నాం అని రేవంత్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటి 6 నెలలు పార్లమెంట్ ఎన్నికలతో గడిచిపోయాయి. ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో పనిచేసింది ఏడాదిన్నర మాత్రమే. ఏడాదిన్నరలోనే రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకొచ్చాం. రూ.లక్ష కోట్ల ఆదాయం వచ్చే ఓఆర్ఆర్‌ను కేవలం రూ.7వేల కోట్లకు భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం అమ్ముకుంది. దీపావళి రోజు కూడా ఇళ్లలో డ్రగ్స్‌తో పట్టుబడిన వారిని ఏమనాలన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీకి డిపాజిట్ రాదని...రాసిపెట్టుకోవాలని సీఎం రేవంత్ అన్నారు. బీజేపీ ఓడితే..హిందువులంతా బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నారని ఒప్పుకుంటారా.. బండి సంజయ్ దీనిని రెఫరెండంగా భావిస్తారా అని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ లో బీజేపీ గెలవాలని కిషన్ రెడ్డికే లేదన్నారు. బీఆర్ఎస్ ను ఓడించండి..బీజేపీ డిపాజిట్ గల్లంతు చేయాలని పిలుపునిచ్చారు రేవంత్. ఏ ఎన్నికనైనా తాను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటానన్నారు రేవంత్.. పార్టీ అభ్యర్థి ఉన్న చోట తాను పోటీలో ఉన్నట్లే ఫీలవుతా... కేసీఆర్ లా ఫామ్ హౌస్ లో పడుకోవాలా? అని ప్రశ్నించారు. ప్రతీ ఎన్నిక తమ ప్రభుత్వ పనితీరుకు పరీక్షేనన్నారు. అండగా ఉంటే పదేళ్లలో అభివృద్ధి ఏంటో చేసి చూపిస్తానన్నారు. సర్వేల గురించి తాను మాట్లాడనన్నారు రేవంత్..డబ్బులిచ్చి సర్వేలు చేయించుకుంటున్నారని ఆరోపించారు. కిషన్ రెడ్డి..కేసీఆర్,కేటీఆర్ లకు లొంగిపోయారని విమర్శించారు.

# సీఎం రేవంత్‌వి బ్లాక్ మెయిల్ రాజకీయాలు

(మొదటి తరువాయి)

చెప్పుకోవడానికి ఏమీ లేకనే.. జూబ్లీహిల్స్‌లో రేవంత్ బ్లాక్ మెయిల్ చేస్తున్నారని అన్నారు. ఓటమి భయంతో రేవంత్ రెడ్డి వ్యక్తిగత కామెంట్స్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్లాక్ మెయిలర్‌కు జూబ్లీహిల్స్ ప్రజలు బుద్ధి చెప్పాలని ఆయన కోరారు.కంటోన్మెంట్‌లో ఆరు వేల డబుల్ బెడ్రూం ఇళ్ళు ఎక్కడ అని ప్రశ్నించారు. ప్రజలను మభ్యపెట్టి కంటోన్మెంట్‌లో గెలిచారన్నారు. రెండేళ్ళుగా అజహారుద్దీన్‌కు మంత్రి పదవి ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. బీఆర్ఎస్ ఒత్తిడితోనే ముస్లింలకు మంత్రి పదవి.. ఎన్టీఆర్, పీజేఆర్ విగ్రహాల హామీలు అంటూ వ్యాఖ్యలు చేశారు. సినీ యాక్టర్స్‌ను జైల్లో పెట్టిన రేవంత్.. సినీ కార్మికులకు ఒంగి ఒంగి దండాలు పెడుతున్నారంటూ ఎద్దేవా చేశారు. 2023లో పీజేఆర్ కొడుకుకు ఎందుకు టికెట్ ఇవ్వలేదని అడిగారు. కాంగ్రెస్ అరాచకం, మంత్రి పదవి ఇవ్వకపోవటంతోనే పీజేఆర్ చనిపోయారంటూ సంచలన కామెంట్స్ చేశారు. జూబ్లీహిల్స్ ప్రజల తీర్పుతో రాష్ట్ర భవిష్యత్‌కు దశ దిశ ఏర్పడుతుందన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో ఏ ఒక్క వర్గం కూడా సంతృప్తిగా లేదని అన్నారు. నాలుగు కోట్ల ప్రజలు కాదు.. నలుగురు బ్రదర్స్ మాత్రమే హ్యాపీగా ఉన్నారంటూ కామెంట్స్ చేశారు. గ్యారంటీలు ఎగ్గొట్టిన అరాచక ప్రభుత్వం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అంటూ విరుచుకుపడ్డారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలిస్తే.. మూడేళ్ళ పాటు నరకయాతన అనుభవించాల్సి ఉంటుందని తెలిపారు. వికాసానికి.. విధ్వంసానికి మధ్య జరుగుతున్న ఎన్నికల్లో ఏది కావాలో ప్రజలు తేల్చుకోవాలన్నారు. రేవంత్ అంటేనే బ్లాక్ మెయిలర్ అంటూ వ్యాఖ్యలు చేశారు. సమాచార హక్కు చట్టాన్ని ఉపయోగించి పారిశ్రామికవేత్తలను బెదిరించిన చరిత్ర రేవంత్ ది అని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అడుగుతోన్న కళాశాలను రేవంత్ బ్లాక్ మెయిల్ చేస్తున్నారని ఆరోపించారు. వైఎస్ ప్రారంభించిన ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలను కేసీఆర్ కొనసాగించారని గుర్తుచేశారు. హైడ్రా విషయంలో డిప్యూటీ సీఎం భట్టి, సీఎం బ్లాక్ మెయిల్ చేస్తున్నారంటూ హరీష్ రావు మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలు మర్రి జనార్ధన్ రెడ్డి, రవీందర్ రావు ఇంటిపై దాడులను మాజీ మంత్రి ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులను బెదిరిస్తోందన్నారు. కాంగ్రెస్ అరాచకాలపై 20 ఫిర్యాదులు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. హోంమంత్రిగా, విద్యామంత్రిగా, మున్సిపల్ మంత్రిగా.. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి అట్టర్ ఎలాప్ అంటూ వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రిపై రోజుకో కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉత్తరాలు రాస్తున్నారని.. సొంత ప్రభుత్వంపై ముఖ్యమంత్రికి పట్టు లేదంటూ విమర్శలు గుప్పించారు. రేవంత్ హయాంలో క్రైం రేటు పెరిగిందన్నారు. కమిషన్ల కోసం కమాండ్ కంట్రోలు సెంటర్‌లో సీఎం సమీక్షలు చేస్తున్నారని మాజీమంత్రి ఆరోపించారు. బీజేపీ నుంచి 8 మంది ఎంపీలు గెలిచినా తెలంగాణకు తెచ్చింది గుండు సున్నా అంటూ వ్యాఖ్యలు చేశారు. నవీన్ యాదవ్ తమ్ముడు వెంకట్ యాదవ్‌కు మూడు ఓట్లు ఉన్నాయన్నారు.

# ప్రైవేట్ విద్యాసంస్థల తాట తీస్తా

(మొదటి తరువాయి)

వారితో చర్చలు ఎలా ఉంటాయని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఫీజురీయంబర్స్‌మెంట్‌పై ప్రైవేటు విద్యాసంస్థలు ఇటీవల బంద్‌కు పిలుపునిచ్చాయి. ప్రభుత్వం వెంటనే ఫీజురీయంబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశాయి. లేకపోతే నిరవధిక ఆందోళన చేపడతామని హెచ్చరించాయి. తెలంగాణ ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో విద్యాసంస్థలను కొనసాగించడం చాలా కష్టంతో కూడుకున్నదని ప్రైవేటు విద్యాసంస్థలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలోనే ప్రైవేటు విద్యాసంస్థలపై సీఎం రేవంత్‌రెడ్డి సీరియస్ అయినట్లు తెలుస్తోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని కోరుతూ తెలంగాణలో ఉన్నత విద్యాసంస్థలు చేపట్టిన బంద్‌పై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. విడతల వారీగా బకాయిలు చెల్లిస్తామన్నారు. మా హయాంలోని బకాయిలు ముందు చెల్లిస్తాం గతంలో ఉన్న బకాయిలపై చర్చిస్తామని అన్నారు.అయితే బందులతో విద్యార్థుల జీవితాలతో ఆటలు ఆడొద్దన్నారు. ఇలా చేయడం విద్యార్థులపై ప్రభావం చూపదా అని అన్నారు. బకాయిలు ఇవాళ కాకపోతే రేపు వసూలవుతాయి. కాలేజీలు బంద్ పెడితే విద్యార్థులు కోల్పోయిన సమయం తిరిగి వస్తుందా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులకు ఇబ్బంది లేదు. అన్ని వర్గాలను సమన్వయం చేసుకుంటూ వెళ్లాలి. రాష్ట్రానికి నెలకు రూ.18వేల కోట్ల ఆదాయం వస్తోంది. జీతాలు, వడ్డీలు, ఇతర ఖర్చులు పోనూ మిగిలేది రూ.5వేల కోట్లే. ఈ ఆదాయంతో రాష్ట్రాన్ని ఎలా నడపాలో చెప్పండి. ప్రభుత్వాన్ని బ్లాక్ మెయిల్ చేస్తున్నారా? కాలేజీలను బంద్ చేయించినవారితో చర్చించేదేముంది? ఏ కాలేజీ ఎంత డొనేషన్ వసూలు చేస్తుందో నాకు తెలుసు. కాలేజీలో నిబంధనలు పాటించకపోతే ఎలా? ఇష్టానుసారం ఫీజులు పెంచుకుంటూ పోతే ఎలా? విద్య వ్యాపారం కాదు.. విద్యను సేవగా భావించాలి. రాజకీయ నేతలు అండగా ఉన్నారని విద్యార్థులతో ఆడుకోవద్దు. అడ్డగోలుగా ఫీజులు పెంచుకుని వచ్చి రీయింబర్స్‌మెంట్ అడుగుతున్నారు. కాలేజీలకు అనుమతుల విషయంలో ఎన్నో అక్రమాలు ఉన్నాయి. కాలేజీల యజమానులు ప్రభుత్వాన్నే బ్లాక్ మెయిల్ చేస్తారా? బీసీ నేత ఆర్.కృష్ణయ్య కూడా అమాయకంగా వాళ్ల ఉచ్చులో పడ్డారు. ఆర్.కృష్ణయ్య, మందకృష్ణ ముందుకొస్తే వాళ్ల చేతికే చిట్టా ఇస్తా. నాలుగు నెలలు ప్రభుత్వాన్ని మీరే నడపండని సీఎం అన్నారు.

## రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

(మొదటి తరువాయి)

నష్టపోయిన రైతులను ఆదుకున్నాం. మేం వచ్చాక పంటల బీమా చెల్లించి రైతులకు అండగా నిలిచాం. పంటలకు గిట్టుబాటు ధర వచ్చేలా చర్యలు తీసుకున్నాం. పంటలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగునీరు ఇస్తున్నాం అని వివరించారు. జలాశయాల్లో పుష్కలంగా నీళ్లు ఉన్నాయి. సాగునీటి ప్రాజెక్టులకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేస్తున్నాం. రాయలసీమలో అన్ని రిజర్వాయర్లు పూర్తి చేశాం. కరవును శాశ్వతంగా నివారించేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టాం. తరచుగా వచ్చే తుపాన్ల వల్ల కూడా రైతులు నష్టపోతున్నారని సీఎం చంద్రబాబు అన్నారు. జగన్ మోహన్ రెడ్డి హయాంలో ప్రాజెక్టుల నిర్వాహణని గాలికొదిలేశారని, కనీసం గేట్లకు గ్రీజు కూడా పెట్టలేదని చంద్రబాబు నాయుడు ఆరోపించారు. 2014 నుంచి 2019 మధ్యలో వ్యవసాయ రంగంలో జీఎస్డీపీ 6 శాతం పైగా పెరిగిందని.. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జీఎస్డీపీ మళ్లీ పడిపోయిందని ఆక్షేపించారు.రైతులకు పంటల బీమా చెల్లింపులో ఇబ్బంది లేకుండా చేశామని చెప్పుకొచ్చారు. కౌలు రైతులు ఎక్కువ భూమిలో వ్యవసాయం చేస్తున్నారని.. నష్టాలు వస్తే ఆత్మహత్య చేసుకుంటున్నారని తెలిపారు.ఆచార్య ఎన్జీ రంగా 125వ జయంతితో పాటు వందేమాతరం 150 వసంతాల వేడుకలు ఒకే రోజు రావటం చరిత్ర అని అభివర్ణించారు. ఆచార్య ఎన్జీ రంగా 33 ఏళ్ల వయస్సులో ఆంధ్రా రైతాంగ ఉద్యమాన్ని నడిపించారని కొనియాడారు. 1964లో రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని పార్లమెంట్‌లో ఆచార్య ఎన్జీ రంగా పోరాడారని కీర్తించారు. ప్రాంతాలకు అతీతంగా నాలుగుచోట్ల ఎంపీగా గెలిచిన చరిత్ర ఆచార్య ఎన్జీ రంగాది అని ప్రశంసించారు. స్వాతంత్య్ర పోరాటంలో పాల్గొన్న ప్రముఖుల్లో ఎన్జీ రంగా ఒకరని చెప్పుకొచ్చారు సీఎం చంద్రబాబు.

## ఫీజు రియంబర్స్‌మెంట్ ఎత్తేసే కుట్ర

(మొదటి తరువాయి)

బకాయిలు చెల్లిస్తామని టోకెన్లు ఇచ్చి మోసం చేసింది నిజం కాదా? అని నిలదీశారు. బకాయిలు చెల్లించకుండా కాలేజీలను మోసం చేస్తోంది నిజం కాదా? అని అన్నారు. శుక్రవారం బీజేపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో బండి సంజయ్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోతే... మరి టోకెన్లు ఎందుకు ఇచ్చినట్లు? అని ప్రశ్నించారు. రాష్ట్ర అసెంబ్లీ సాక్షిగా ఎందుకు హామీ ఇచ్చారని నిలదీశారు. చట్టసభలో ఇచ్చిన హామీకే విలువ లేకుంటే ఇక అసెంబ్లీకి విలువ ఏముందని అడిగారు. సార్వత్రిక ఎన్నికలకు ముందే తెలంగాణ రూ.7 లక్షల కోట్ల అప్పుల్లో ఉందని రేవంత్‌రెడ్డే చెప్పారు కదా? అని గుర్తుచేశారు. ఇప్పుడు అందుకు భిన్నంగా మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టించడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోతే కాలేజీలు ఎలా నడవాలని నిలదీశారు బండి సంజయ్. అధ్యాపకులకు జీతాలివ్వకపోతే విద్యార్థులకు చదవు చెప్పేదెవరు..? అని అడిగారు. కాలేజీ యాజమాన్యాలపై సీఎంకు ఉన్న కోపంతో.. విద్యార్థుల జీవితాలను బలి చేయాలనుకుంటున్నారా? అని ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తేసేందుకు కాంగ్రెస్ కుట్ర చేస్తోందని ఆరోపించారు. చట్టం పేరుతో బెదిరింపులకు పాల్పడితే పాలన నడవదనే విషయాన్ని సీఎం గుర్తుంచుకోవాలని హితవు పలికారు. తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించి చట్టం గురించి మాట్లాడితే మంచిదని సూచించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని కొనసాగిస్తారా? ఎత్తి వేస్తారా? ప్రజలకు స్పష్టం చేయాలని పేర్కొన్నారు.

# భారాన్ని మోయకండి.. ఆ ప్రమాదం మీ కుమారుడి తప్పు కాదు

## ఎయిర్ ఇండియా ఘటనపై సుప్రీంకోర్టు




**న్యూఢిల్లీ -నవంబర్ -07 ప్రభ**
ఈ ఏడాది జూన్‌లో అహ్మదాబాద్ లో జరిగిన ఘోర విమాన ప్రమాదం తీవ్ర విషాదాన్ని మిగిల్చిన విషయం తెలిసిందే. అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరిన ఎయిర్ ఇండియా బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ టేకాఫ్ అయిన నిమిషాల్లోనే ఓ బిల్డింగ్‌పై కూలిపోయింది. ఈ ఘటనలో కెప్టెన్ సుమీత్, కో-పైలట్ క్లైవ్ కుందర్ సహా విమానంలో ఉన్న దాదాపు 260 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంపై న్యాయస్థానం పర్యవేక్షణలో స్వతంత్ర దర్యాప్తును జరపాలంటూ ప్రమాదంలో మృతి చెందిన కెప్టెన్ సుమీత్ సభర్వాల్ తండ్రి పుష్కర్ రాజ్ సభర్వాల్ (91) సుప్రీం కోర్టు ను ఆశ్రయించిన విషయం తెలిసిందే దీనిపై జస్టిస్ సూర్యకాంత్, జోయ్‌మల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ మేరకు సానుభూతి వ్యక్తం చేస్తూ.. ఈ విషాదానికి మీ కొడుకుని నిందించడం లేదని తెలిపింది. 'ఈ ప్రమాదం పైలట్ తప్పు అని దేశంలో ఎవరూ నమ్మడం లేదు. మీ కుమారుడిని నిందిస్తున్న భారాన్ని మీరు మోయకూడదు' అని వ్యాఖ్యానించింది. 'ఈ ప్రమాదం జరగడం చాలా దురదృష్టకరం. మీ కుమారుడిని నిందిస్తున్న భారాన్ని మీరు మోయకూడదు. అతడిని ఎవరూ నిందించలేరు. పైలట్ తప్పు అని దేశంలో ఎవరూ నమ్మడం లేదు. ఇప్పటి వరకూ పైలట్‌పై ఎలాంటి ఆరోపణలూ లేవు. దర్యాప్తులో ఇద్దరు పైలట్ల మధ్య సంభాషణ మాత్రమే బయటకు వచ్చింది' అని పేర్కొంది.

# డయబిటిస్, ఒబెసిటీ ఉన్నా వీసా తిరస్కరణ

**తాజాగా ప్రతిపాదనలు తెస్తున్న ఆమెరికా అంతర్జాతీయ మీడియా కథనాలు**



**వాషింగ్టన్,-నవంబర్ -07 ప్రభ**
అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వలసదారులపై,వారికిచ్చే వీసాలపై కఠిన నిబంధనలు అమలు చేస్తోన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో నిబంధనను తీసుకొచ్చారు. డయాబెటిస్, ఒబెసిటీ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి వీసాలను తిరస్కరించాలనే కొత్త నిబంధనలను రూపొందించారు. ఈ మేరకు అమెరికా ఎంబసీలు, కాన్సులర్ కార్యాలయాలకు అగ్రరాజ్య విదేశాంగ శాఖ తాజాగా మార్గదర్శకాలు జారీ చేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. సాధారణంగా అమెరికా వీసా కోసం దరఖాస్తు చేసుకునే వారి ఆరోగ్య స్థితిని ఇమిగ్రేషన్ అధికారులు పరిశీలిస్తారు. టీబీ వంటి అంటు వ్యాధులు ఉన్నాయో లేదో స్క్రీనింగ్ చేస్తారు. ఈ నిబంధనలను తాజాగా సవరించారు. మరిన్ని వ్యాధులను ఈ జాబితాలో చేరుస్తూ మార్గదర్శకాలు రూపొందించారు. అంటే.. ఇకపై వీసా కోసం దరఖాస్తు చేసుకున్న వలసదారుల మెడికల్ హిస్టరీపై అధికారులు మరింత దృష్టి సారించ నున్నారు. వారు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతుంటే తిరస్కరించాలన ఇనిర్ణయించారు. హృద్రోగ సమస్యలు, శ్వాస సంబంధిత వ్యాధులు, క్యాన్సర్, డయాబెటిస్, జీవక్రియ, నాడీ సంబంధిత వ్యాధులు, మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడేవారిని సంరక్షించాలంటే లక్షల డాలర్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇక, ఒబెసిటీ కారణంగా ఆస్తమా, స్లీప్ ఆప్నియా, హై బీపీ వంటి సమస్యలు ఎదురవుతాయి. ఇలాంటి వ్యాధిగ్రస్తులకు సుదీర్ఘ వైద్య సంరక్షణ అవసరం. ఆర్థిక భారం కూడా ఎక్కువే. అందుకే వలసదారుల ఆరోగ్య పరిస్థితిని అంచనా వేసి వారు ప్రభుత్వ వనరులపై ఆధారపడుతారో లేదో గుర్తించాలి. ఒకవేళ అలాంటి వారైతే అమెరికాలోకి ప్రవేశాన్ని తిరస్కరించాలని ఆ మార్గదర్శకాల్లో వెల్లడించారు.అయితే, ఈ వార్తలపై అమెరికా విదేశాంగ శాఖ స్పందించలేదు. దీంతో ఈ రూల్స్ అమల్లోకి వచ్చాయా లేదా అన్న దానిపై స్పష్టత లేదు.


# వీధి కుక్కలను షెల్టర్లకు తరలించండి

**స్కూల్స్, బస్టాండ్, రైల్వేస్టేషన్, ఆస్పత్రుల్లోకి రాకుండా కంచెలు సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు**



**న్యూఢిల్లీ -నవంబర్ -07 ప్రభ**
విద్యా సంస్థలు, బస్టాండ్, రైల్వేస్టేషన్, ఆస్పత్రులు, క్రీడా సముదాయాలు, ఇతర బహిరంగ ప్రదేశాల సమీపం నుంచి వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. ఆయా ప్రదేశాల్లోకి రాకుండా కంచెలు వేయాలని పేర్కొంది. ఈ ప్రదేశాల్లో కుక్కలు లేవని నిర్ధారించుకునేందుకు క్రమం తప్పకుండా తనిఖీలు చేయాలని ఆదేశించింది. వాటిని పట్టుకున్నచోటే వదిలేయొద్దని స్పష్టం చేసింది. ఎనిమిది వారాల్లోగా అమలు విధానం, చర్యలపై స్టేటస్ రిపోర్టు సమర్పించాలని ఆదేశించింది. తదుపరి విచారణను జనవరి 13కు వాయిదా వేసింది. వీధి కుక్కల కేసులో శుక్రవారం విచారణ చేపట్టిన జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్‌వి అంజారియాతో కూడిన సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. జాతీయ రహదారులపైకి కుక్కలు, పశువులు రాకుండా చర్యలు తీసుకోవాలని, వాటి కోసం ఏర్పాటుచేసిన షెల్టర్లకు తరలించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, జాతీయ రహదారులశాఖ, స్థానిక సంస్థలు హైవే గస్తీ బృందాలకు ఆదేశాలిచ్చింది. రెండు వారాల్లోగా మున్సిపల్ సిబ్బంది వీధి కుక్కలు ఉండే స్థలాలను, భవనాలను గుర్తించాలని సూచించింది. వీధి కుక్కలను స్టెరిలైజేషన్ చేసి, రీ లకేషన్ చేయాలని స్పష్టం చేసింది. అమికస్ క్యూరీ నివేదికలో పేర్కొన్న విషయాలు కోర్టు ఆదేశాల్లో భాగంగా పరిగణించబడతాయని సుప్రీం పేర్కొంది. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు నివేదికలో గుర్తించిన లోపాలను సరిచేయడానికి తీసుకున్న చర్యల వివరాలతో సమగ్ర అఫిడవిట్ దాఖలు చేయాలని సూచించింది. రాజస్థాన్ హైకోర్టు ఆదేశాలను సుప్రీంకోర్టు పునరుద్ఘాటించింది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు ఆదేశాల అమలుకు బాధ్యత వహించాలని, విఫలమైతే వ్యక్తిగత చర్యలు తీసుకోబడతాయని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

# వెనిజులా తీరం వెంబడి అమెరికా బాంబర్ల చక్కర్లు



**కరాకస్, - -నవంబర్ -07 ప్రభ**
అమెరికా, వెనిజులా మధ్య ఉద్రిక్తతలు మరోసారి భగ్గుమన్నాయి. రెండు అమెరికా B-52 బాంబర్లు కరేబియన్ సముద్రంలో వెనిజులా తీరం వెంబడి ప్రయాణించాయి. ఇటీవలి వారాల్లో అమెరికా సైనిక విమానాలు ఈ ప్రాంతంలో శక్తి ప్రదర్శన చేయడం ఇది నాలుగోసారి కావడం గమనార్హం. ఈ పరిణామం ఇరు దేశాల మధ్య ఇప్పటికే ఉన్న వైరాన్ని మరింత పెంచింది. విమాన కదలికలను ట్రాక్ చేసే వెబ్‌సైట్ 'ఫ్లైట్ రాడార్ 24' డేటా ప్రకారం, ఈ రెండు బాంబర్లు వెనిజులా తీరానికి సమాంతరంగా ప్రయాణించాయి. ఆ తర్వాత రాజధాని కరాకస్‌కు ఈశాన్య దిశలో కాసేపు చక్కర్లు కొట్టి, తిరిగి తీరం వెంబడి ప్రయాణిస్తూ ఉత్తర దిశగా సముద్రంలోకి వెళ్లిపోయాయి. అక్టోబర్ మధ్య నుంచి అమెరికా సైనిక విమానాలు వెనిజులా సమీపంలో ప్రయాణించడం ఇది నాలుగోసారి. గతంలో ఒకసారి B-52, రెండుసార్లు B-1B బాంబర్లు ఇలాంటి విన్యాసాలు చేశాయి. ఈ ప్రాంతంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు సైనిక చర్యలు చేపడుతున్నామని వాషింగ్టన్ చెబుతోంది. ఇందులో భాగంగానే యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్. ఫోర్డ్ యుద్ధనౌక బృందాన్ని లాటిన్ అమెరికాకు పంపింది. ప్యూర్టోరికోలో F-35 స్టెల్త్ యుద్ధ విమానాలను, కరేబియన్ సముద్రంలో ఆరు నౌకాదళ నౌకలను మోహరించింది. సెప్టెంబర్ నుంచి ఇప్పటివరకు డ్రగ్స్ రవాణా చేస్తున్నాయనే ఆరోపణలతో 17 నౌకలపై దాడులు చేశామని, ఈ దాడుల్లో 67 మంది మరణించారని అమెరికా పేర్కొంది. అయితే, లక్ష్యంగా చేసుకున్న నౌకలు మాదకద్రవ్యాల రవాణాకు ఉపయోగించబడ్డాయని గానీ, అవి దేశానికి ముప్పుగా పరిణమించాయని గానీ అమెరికా ఇప్పటివరకు ఎలాంటి ఆధారాలను విడుదల చేయలేదు. ఈ సైనిక కదలికలు, దాడులతో ప్రాంతీయంగా తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. డ్రగ్స్ నిరోధం అనేది కేవలం ఒక సాకు మాత్రమేనని, అధ్యక్షుడు నికోలస్ మాదూరో ప్రభుత్వాన్ని కూలదోయడానికే వాషింగ్టన్ కుట్ర పన్నుతోందని వెనిజులా తీవ్రంగా ఆరోపిస్తోంది.

# వందేమాతర గీతం జాతీయవాద జ్వాలను రగిలిస్తోంది

**కేంద్ర మంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు**



**న్యూఢిల్లీ -నవంబర్ -07 ప్రభ**
వందేమాతరం గేయానికి 150 ఏళ్లు నిండాయి. స్వాతంత్ర్యోద్యమంలో ఆ గేయం ప్రజల్లో ఎంతో స్ఫూర్తి నింపింది. అయితే ఆ గేయం దేశ ప్రజల్లో ఇప్పటికీ నిరంతరం జాతీయవాద జ్వాలను రగిలిస్తోందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అన్నారు. దేశ ఐక్యత, దేశభక్తి, యువతలో ఉత్తేజానికి ఆ గేయం ఇంకా మూలంగానే ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. తన ఎక్స్ అకౌంట్‌లో కేంద్ర మంత్రి అమిత్ షా ఓ పోస్టు చేశారు. నవంబర్ 7వ తేదీ నుంచి వచ్చే ఏడాది నవంబర్ 7వ తేదీ వరకు వందే మాతరం ఉత్సవాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. వందేమాతర గేయం కేవలం పదాల అల్లిక కాదు అని, అది భారత దేశ అంతరాత్మను అందించిన స్వరమన్నారు. ఆంగ్లేయులకు వ్యతిరేకంగా వందేమాతర గీతం దేశాన్ని ఐక్యంగా నిలిపిందన్నారు. స్వాతంత్ర్యోత్సవ జాగరణను బలోపేతం చేసిందన్నారు. మాతృదేశం కోసం అంకితమయ్యేలా, గర్వపడేలా, స్ఫూర్తి పొందేలా ఆ గేయం విప్లవకారుల్ని ఆకట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాదితో మన జాతీయ గీతానికి 150 ఏళ్లు నిండుతున్నట్లు ఆయన చెప్పారు. ఈ గేయాన్ని కుటుంబ సభ్యులతో కలిసి బలమైన స్వరంలో పూర్తి పాటను పాడాలని, భవిష్యత్తు తరాలకు వందేమాతర గేయం ప్రేరణగా నిలుస్తుందని అమిత్ షా తెలిపారు. వందేమాతర గీతాన్ని బంకిమ్ చంద్ర ఛటర్జీ కంపోజ్ చేశారు. సాహిత్య జర్నల్ బంగదర్శన్‌లో నవంబర్ 7, 1875లో ఈ గేయం పబ్లిష్ అయ్యింది. ఆ తర్వాత 1882లో ప్రచురించిన ఆనందమట్ నవలలోనూ ఈ గేయాన్ని ఆయన పొందుపరిచారు. రబీంద్రనాథ్ ఠాకూర్ ఈ గేయానికి మ్యూజిక్ అందించారు.

# దొంగచాటు అణు కార్యక్రమం పాక్‌కు అలవాటే

**ట్రంప్ వ్యాఖ్యలకు విదేశాంగశాఖ స్పందన**



**న్యూఢిల్లీ -నవంబర్ -07 ప్రభ**
రహస్యంగా, చట్టవిరుద్ధంగా అణు కార్యకలాపాలు కొనసాగించడంలో పాకిస్థాన్‌కు దశాబ్దాల చరిత్ర ఉందని భారత విదేశాంగశాఖ స్పష్టం చేసింది. స్మగ్లింగ్, ఎగుమతి నియంత్రణ ఉల్లంఘనలు, రహస్య భాగస్వామ్యాలు దశాబ్దాలుగా పాకిస్థాన్‌కు అలవాటేనని తెలిపింది. ఏకే ఖాన్ నెట్‌వర్క్ విస్తరణ చుట్టూ ఇది కేంద్రీకృతమైందని భారత విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ పేర్కొన్నారు. ప్రపంచంలో అణ్వాయుధాలను పరీక్షిస్తున్న దేశాల్లో పాకిస్థాన్ కూడా ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై భారత్ స్పందించింది. ఆ వ్యాఖ్యలను నిశితంగా పరిశీలిస్తున్నామని తెలిపింది.ఈ అంశాలను అంతర్జాతీయ సమాజం దృష్టికి భారత్ ఎల్లప్పుడూ తీసుకెళ్తూనే ఉంటుందని జైశ్వాల్ అన్నారు. వచ్చే ఏడాది భారత్‌లో పర్యటిస్తానని ట్రంప్ చేసిన ప్రకటన గురించి అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. దీనిపై ప్రస్తుతానికి తమకు ఎటువంటి సమాచారం లేదన్నారు. ప్రపంచంలో చాలా దేశాలు చురుగ్గా అణ్వాయుధాలను పరీక్షిస్తున్నాయని, ఆ జాబితాలో పాకిస్థాన్ ఉందని అమెరికా అధ్యక్షుడు ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. రష్యా, చైనా, ఉత్తరకొరియా, పాకిస్థాన్ వంటి దేశాలు అణు పరీక్షలను నిర్వహిస్తున్నాయని, వాళ్లెవ్వరూ ప్రశ్నించరని అన్నారు. తాము మాత్రం బహిరంగంగానే చెబుతామన్నారు. ఇన్నాళ్లూ ఎన్ని దేశాలు అణు పరీక్షలు చేపట్టినా వాటి జోలికి వెళ్లలేదని.. ఇకపై అలా మిగిలిపోవాలనుకోవట్లేదన్నారు. ఇతర దేశాల మాదిరిగానే తామూ అణు పరీక్షలు నిర్వహిస్తామని ట్రంప్ స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

# భరణం పెంచాలని సుప్రీంకోర్టును ఆశ్రయించిన షమీ భార్య



**న్యూఢిల్లీ - -నవంబర్ -07 ప్రభ**
టీమ్ ఇండియా స్టార్ పేసర్ మహ్మద్ షమీ మాజీ భార్య హసీన్ జహాన్ రూ.4 లక్షల భరణం సరిపోవడం లేదని సుప్రీంకోర్టును ఆశ్రయించారు. నెలకు కనీసం రూ.10 లక్షలు భరణంగా నిర్ణయించాలని ఆమె కోరారు. పెరుగుతున్న జీవన వ్యయాలను, షమీ అధిక ఆదాయాన్ని పరిగణలోకి తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు షమీకి నోటీసులు జారీ చేసి, ఆయన సమాధానం కోరింది. "నెలకు రూ.4 లక్షలు ఇప్పటికే పెద్ద మొత్తం కాదా?" అని కోర్టు వ్యాఖ్యానించింది. తదుపరి విచారణలో భరణం పెంపుపై కోర్టు మరింత వివరంగా విచారించనుంది.

## సంపాదకీయం

# స్వాతంత్ర్యోద్యమంలో ప్రేరణ మంత్రం వందేమాతరం !



ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాల్లో వందేమాతరం తరవాత భారతదేశం నా మాతృభూమి..అంటూ ప్రతిజ్ఞ చేయించేవారు. వందేమాతరం చదివిన తరవాతనే పాఠశాల తరగతి గదులు ప్రారంభం అయ్యేవి. ఆనాటి నిబద్ధత ఇప్పుడు ప్రైవేట్ స్కూళ్లు వచ్చాక కనుమరుగయ్యింది. జగనణమన కూడా మనదేశ ఆత్మగా నిలిచింది. ఈ రెండు గీతాలకు భారతదేశంలో విడదీయరాని సంబంధం ఏర్పడింది. దేశాన్ని ఏకతాటిపై నడిపించిన వందేమాతరం గీతానికి 150 వత్సరాలు. నిత్యనూతనంగా ఇప్పటికీ వందేమాతరం మార్మోగు తోంది. దేశాన్ని కట్టిపడేసే ప్రార్థనాగీతంగా ఇది ఎంతో ప్రాచుర్యం కలిగించింది. స్వాతంత్ర్య ఉద్యమ శ్లోకంగా నిలిచి నేటికీ జాతీయ గీతంగా భాసిల్లుతోంది. వందేమాతర గీతం తరవాతనే దేశవ్యాప్తంగా ఉత్తేజితం మొదలయ్యింది. బ్రిటిష్ వారిని పారదోలేందుకు ఇది ఎంతగానో తోడ్పడింది. ప్రజలను ఏకం చేయడంలో వందేమాతర గీతం నిప్పుకణికలా మండింది. ఎక్కడిక్కడ వందేమాతరం గీతాలాపనతో ప్రజలు ఉద్యమంలో దుమికారు. అందుకే ఆనాటి బ్రిటిష్ పాలకులు వందేమాతర గీతం పాడిన వారిపై దమనకాండకు తెగించారు. 1875లో కార్తిక శుక్ల నవమి, జగద్ధాత్రి పూజనాడు బంకించంద్ర ఛటర్జీ కలం నుంచి జాలువారిన వందేమాతర గీతం...స్వాతంత్ర్య ఉద్యమానికి ప్రేరణగా నిలిచింది. భారతదేశ పురాతన సాంస్కృతిక మూలాలు ఈ గీతరచనకు ప్రేరణనిచ్చాయి. సర్వ మంగళ మాంగళ్యే శివే... అంటూ సాగే దేవీమాత స్తోత్రం వందేమాతరం గీతానికి ప్రేరణగా భావిస్తారు. అందుకే కొందరు దీనిని పాడడానికి ఇప్పటికీ ఇష్టపడరు. ఇది మనదేశ దౌరభాగ్యంగా చూడాలి. మతం ముసుగులో కొందరు దీనిని తృణీకరించినా అది ప్రజల నరనరాల్లో జీర్ణించుకుపోయిన ఉత్తేజిత గీతంగా నిలిచింది. భారతదేశ చరిత్రలో మహోద్యమాలకు కళలూ పాటలూ అంతరాత్మగా నిలిచిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. అంతెందుకు తెలంగాణ ఉద్యమంలో పాటే పరవళ్లు తొక్కపోతే ఉద్యమమే లేదు. జాతి భావోద్వేగాలను వెన్నుతట్టి స్వాతంత్ర్య కాంక్ష అనే సమష్టి కార్యాచరణ కు పురిగొల్పడంలో వందేమాతరం గీతం కీలకభూమిక పోసించింది. అందుకే భారత స్వాతంత్ర్య పోరాటంలో అత్యంత ప్రత్యేకమైనదిగా వందేమాతరం గీతం నిలిచింది. ఈ అమర గీతం వెలువడి 150 సంవత్సరాలైనందున ఏడాదిపాటు దేశమంతటా ఉత్సవాలు నిర్వహించాలని కేంద్రం నిశ్చయించింది. స్వాతంత్ర్య ఉద్యమానికి జవజీవాలు అందించడమే కాదు, సాంస్కృతిక జాతీయవాదానికి బీజం వేసింది. భారతదేశమంటే మట్టి కాదనీ... కర్తవ్యం, అంకితభావాలతో పునీతమైన పుణ్యతీర్థమనీ ప్రబోధించింది. మహర్షి అరవిందుడు వర్ణించినట్లు– బంకించంద్రుడు ఆధునిక భారత రుషి. ఆయన పదాలు జాతి ఆత్మను మళ్లీ మేల్కొలిపాయి. నిదురిస్తున్న జాతి తన ఆత్మబలాన్ని కనుగొనేలా జాగృతం చేయడంలో వందేమాతరం గీతం ప్రముఖ భూమిక పోషించచదనడంలో సందేహం లేదు. బ్రిటిష్ పాలకుల ఇనుప ఉక్కు సంకెళ్ల కింద నలిగిపోతున్న తరుణంలో బంకించంద్ర ఛటర్జీ రచించిన వందేమాతరం జాతికి ప్రభాత గీతమైంది. మన సంస్కృతి, నాగరికతల పట్ల గర్వాభిమానాలను రేకెత్తించే గానమైంది. అణువణువునా మాతృభూమిపై భక్తి, అనురక్తి ఉట్టిపడేలా మేల్కొలిపే రణనినాద గీతమైంది. వందేమాతరం భాషా ప్రాంతీయ భేదాలకు అతీతంగా కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు జాతిని జాగృతం చేసింది. బ్రిటిష్ వలస పాలకులపై ధిక్కార ప్రకటనగా ప్రజలు యావద్దేశంలో వందేమాతరం అంటూ నినదించారు. 1905లో బెంగాల్ విభజనపై నిరసన వెల్లువెత్తినప్పుడు వందేమాతరం అంతటా మార్మోగింది. దాంతో బ్రిటిష్ పాలకులు ఆ పాటను నిషేధించారు. కానీ, 1906 ఏప్రిల్ 14న బారిసాల్‌లో వేలమంది ఉద్యమకారులు ఆ నిషేధాన్ని ధిక్కరించి వందేమాతరం అంటూ ఘోషించారు. లాఠీ దెబ్బలకు రక్తమోడుతున్నా లెక్కచేయకుండా స్త్రీపురుషులు అలా ఘోషిస్తూనే ఉన్నారు. 1946లో తిరుగుబాటు చేసిన రాయల ఇండియన్ నేవీలోని భారతీయ నావికులు వందేమాతరం అంటూ నినదిస్తూ బ్రిటిష్ యుద్ధనౌకలపై జాతీయ పతాకను ఆవిష్కరించారు. మొద్దునిద్రలో ఉన్నవారినైనా మేల్కొలిపే మంత్రశక్తి వందేమాతరానికి ఉందని మహాత్మాగాంధీ పేర్కొన్నారు. ఇన్నేళ్లయినా వన్నె తగ్గకుండా మనజీవితాల్లో అది పెనవేసుకుపోయింది. భారతజాతిని కలసి ఉంచే గీతంగా నిలిచింది. స్వాతంత్ర్య ఉ ద్యమంలో వెలిగిన ఈగీతాజ్యోతి ఇంకా జ్వాజ్వల్యమానంగా వెలుగుతోంది. ఇప్పుడు ఏడాది ఉత్సవాల్లో భాగంగా వందేమాతరం పూర్తిరూపంలో ప్రతిధ్వనిస్తూ యువత మనసుల్లో సాంస్కృతిక జాతీయవాదాన్ని నింపుతుందనడంలో సందేహం లేదు. వందేమాతరం కేవలం గత వైభవ స్మరణం కారాదు. మనజాతిని మేల్కొలిపే ఉజ్జ్వల భవిష్యత్తుకు ప్రేరణగానూ తీసుకోవాలి. భారత ఆత్మను ఆవహించుకునే గీతంగా చూడాలి. ఘనమైన భారతదేశ సంస్కృతీ నాగరికతలపై మనకున్న అభిమానాలకు నిదర్శనమైన ఆ గీతస్ఫూర్తిని ఆచరణలోకి తీసుకురావడం మనందరి బాధ్యత. వందేమాతరం పారతంత్ర భారతదేశానికి తొలి మేల్కొలుపు. మొక్కవోని దీక్షను చాటిన స్వేచ్ఛా గీతమది.

# జీతం ట్రిలియన్ డాలర్లు..

## ఆనందం పట్టలేక రోబోతో కలిసి డ్యాన్స్ చేసిన మస్క్..

**న్యూఢిల్లీ -నవంబర్ 7 ( ప్రభ )**
ప్రపంచ కుబేరుడు, టెస్లా బాస్ ఎలాన్ మస్క్ సంచలనం సృష్టించారు. కార్పొరేట్ చరిత్రలోనే అత్యధిక జీతం అందుకుంటున్న సీఈవోగా ఆయన రికార్డు క్రియేట్ చేశారు. జీతం కింద మస్క్‌కు ట్రిలియన్ డాలర్లు ఇచ్చేందుకు టెస్లా కంపెనీ షేర్‌హోల్డర్లు ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. టెక్సాస్‌లోని ఆస్టిన్‌లో జరిగిన టెస్లా వార్షిక సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. దీంతో మస్క్ ఆనందానికి అవధులు లేవు. ఈ గుడ్‌న్యూస్‌ను తన సంస్థకు చెందిన హ్యూమనాయిడ్ రోబోస్‌తో సెలబ్రేట్ చేసుకున్నారు. రోబోలతో కలిసి ఉత్సాహంగా డ్యాన్స్ చేస్తూ మస్క్ సందడి చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది.జీతం కింద మస్క్‌కు ట్రిలియన్ డాలర్లు



ఇచ్చేందుకు టెస్లా కంపెనీ షేర్‌హోల్డర్లు ఆమోదించారు. వార్షిక కంపెనీ మీటింగ్‌లో మస్క్ జీతంపై నిర్ణయం తీసుకున్నారు. దీంతో పే ప్యాకేజీలో కొత్త రికార్డు క్రియేట్ అయ్యింది. కంపెనీకి చెందిన షేర్‌హోల్డర్లలో 75 శాతం ఓట్లు ఆయనకు అనుకూలంగా వచ్చాయి. ఇప్పటికే ప్రపంచ కుబేరుడైన మస్క్.. ఇప్పుడు తన సంపదను మరింత పెంచుకోనున్నారు. అయితే రాబోయే పదేళ్లలో ఎలక్ట్రిక్ కార్ల కంపెనీ టెస్లా మార్కెట్ వాల్యూ ఆయన మరింత పెంచాల్సి ఉంటుంది. ఒకవేళ షేర్‌హోల్డర్లు అనుకున్నట్లు మస్క్ తన లక్ష్యాలను సాధిస్తే, అప్పుడు ఆయనకు లక్షల సంఖ్యలో షేర్లు కలిసిరానున్నాయి.మస్క్‌కు ట్రిలియన్ డాలర్ల పే ప్యాకేజీ అందాలంటే ఆయన ముందు కొన్ని టార్గెట్లను పూర్తి చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం టెస్లా మార్కెట్ విలువ 1.4 ట్రిలియన్ల డాలర్లుగా ఉన్నది. అయితే ఆ మార్కెట్ విలువను ఆయన 8.5 ట్రిలియన్ డాలర్లకు చేర్చాల్సి ఉంటుంది. స్వీయ డ్రైవింగ్ చేస్తున్న లక్షల సంఖ్యలో రోబోట్యాక్సీ వాహనాలను ఆయన కమర్షియల్ ఆపరేషన్‌లోకి తీసుకురావాల్సి ఉంటుంది. ఒకవేళ అన్నీ అనుకుట్లే సాగితే, ప్రపంచ కుబేరుడు మస్క్ ప్రపంచంలోనే తొట్టతొలి ట్రిలియనీర్ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

# ఆర్ఎస్ఎస్, బిజెపి కార్యాలయాల్లో ఎప్పుడూ వందేమాతరం పాడలేదు

**న్యూఢిల్లీ -నవంబర్ 7 ( ప్రభ )**
స్వాతంత్ర్యోద్యమ సమయంలో భారతీయులకి స్ఫూర్తి నింపిన వందేమాతరం గేయానికి నేటికి 150 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఢిల్లీలో ఈ గేయ స్మారకోత్సవంలో ప్రధాని మోడీ పాల్గొని గొప్పగా చెప్పారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బిజెపి, ఆర్ఎస్ఎస్‌లపై విరుచుకుపడ్డారు. భారత స్వాతంత్ర్య పోరాటానికి ఈ పాట ప్రసిద్ధ నినాదం. అయినప్పటికీ బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు తమ కార్యాలయాల్లోగానీ, శాఖల్లోగానీ పాడలేదు. సొంత గ్రంథాల్లోగానీ, సాహిత్యంలోనూ ఈ పాటను పొందుపరచలేదు అలాంటిది ఇప్పుడు బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు ఈ గేయ 150 స్మారకోత్సవాలు జరుపుతున్నాయని ఖర్గే విమర్శించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటనను విడుదల చేశారు. ఆర్ఎస్ఎస్ జాతీయ గీతం కంటే 'నమస్తే సదా వతసలే పాడటానికే ఇష్టపడిందని ఆయన తన ప్రకటనలో ఎత్తిచూపారు. కాంగ్రెస్ పార్టీ 1986 నుండి నేటి వరకు ప్రతి సమావేశం, ప్లీనరీ అయినా, బ్లాక్‌స్థాయి సమావేశం అయినా నేతలు వందేమాతరం పాటను ఆలపిస్తారు. నేడు జాతీయవాద సంరక్షకులమని చెప్పుకునే ఆర్ఎస్ఎస్, బిజెపిలు తమ శాఖల్లోగానీ లేదా కార్యాలయాల్లో గానీ వందేమాతరం లేదా మన జాతీయ గీతం జనగణమనను ఎప్పుడూ పాడకపోవడం విడ్డూరం. వాటికి బదులుగా వారు దేశాన్ని కాదు.. వారి సంస్థల్ని కీర్తిస్తూ నమస్తే సదా వత్సల అనే పాటను పాడుతున్నారు. 1925లో స్థాపించినప్పటి నుండి ఆర్ఎస్ఎస్ సార్వత్రిక గౌరవం ఉన్నప్పటికీ వందేమాతరాన్ని నిరాకరించింది. ఈ పాటను ఆర్ఎస్ఎస్ స్వీకరించలేదు. ఆర్ఎస్ఎస్ గ్రంథాలలో లేదా సాహిత్యంలో ఒక్కసారి కూడా పాట ప్రస్తావన కనిపించదు అని ఖర్గే శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోడీ న్యూఢిల్లీలో జరిగిన ఈ గేయ 150వ వార్షికోత్సవ వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్మారక స్టాంపును ఆయన విడుదల



చేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా బీహార్‌లోని పాట్నాలో జరిగిన ఒక కార్యక్రమానికి హాజరయ్యారు. అక్కడ ఆయన దేశవ్యాప్తంగా ఏడాది పొడవునా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. దీనిపై ఖర్గే విమర్శించారు. స్వాతంత్ర్య పోరాట సమయంలో ఆర్ఎస్ఎస్ భారతీయులకు కాకుండా బ్రిటీష్ వారికి మద్దతు ఇచ్చింది. రాజ్యాంగాన్ని దుర్వినియోగం చేసింది. 52 సంవత్సరాలు జాతీయ జెండాను ఎగురవేయలేదు. బాబాసాహెబ్ అంబేద్కర్ దిష్టిబొమ్మలను తగలబెట్టిందనే విషయం అందరికీ తెలుసు. సర్దార్ పటేల్ మాట్లో చెప్పాలంటే.. గాంధీజీ హంతకులు అని ఖర్గే తన ప్రకటనలో తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

కాంగ్రెస్ పార్టీ వందేమాతరం, జనగణమణ రెండు గేయాలను ఎంతో గర్విస్తుంది. ప్రతి కాంగ్రెస్ సమావేశంలో, కార్యక్రమంలో ఈ రెండు పాటలను కార్యకర్తలు, నేతలందరూ ఎంతో భక్తితో పాడతారు. ఇది భారతదేశ ఐక్యతను, గర్వాన్ని సూచిస్తుంది. వందేమాతర గర్వాన్ని మోసేది కాంగ్రెస్‌నే. 1896లో కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో అప్పటి కాంగ్రెస్ అధ్యక్షుడు రహమతుల్లా సయాని నాయకత్వంలో గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్ మొదటిసారిగా వందేమాతరం పాటను బహిరంగంగా పాడారు. ఆ క్షణం స్వాతంత్ర్య పోరాటానికి కొత్త ప్రాణం పోసింది. మత, కుల, ప్రాంతీయ గుర్తుంపును తారుమారు చేస్తూ బ్రిటీష్ సామ్రాజ్యం విభజించి పాలించే విధానం, భారతదేశ ఐక్యతను విచ్ఛిన్నం చేయడానికి రూపొందించబడిందని కాంగ్రెస్ అర్థం చేసుకుంది. దీనికి వ్యతిరేకంగా వందేమాతరం గీతం అచంచలమైన శక్తి గీతంగా మారింది. భారతమాతపట్ల భక్తితో భారతీయులందరినీ ఏకం చేసింది అని ఖర్గే గుర్తుచేశారు. 1905 బెంగాల్ విభజన నుండి మన విప్లవకారుల తుది శ్వాస వరకు వందేమాతరం దేశమంతటా ప్రతిధ్వనించింది. ఇది లాలా లజపతి రారు ప్రచురణ శీర్షిక అని, భికాజీ కామా తయారు చేసిన జెండాపై చెక్కబడిందని ఖర్గే పేర్కొన్నారు. ఈ పాట ప్రజాదరణకు బ్రిటీష్‌వారు భయపడ్డారు. స్వాతంత్ర్య పోరాటానికి గుండె చప్పుడుగా మారిన ఈ పాటను బ్రిటీష్‌వారు నిషేధించారని ఖర్గే అన్నారు.

1938లో పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఇలా రాశారు. 30 సంవత్సరాలకు పైగా ఈ పాట భారత జాతీయవాదంపై ప్రభావం చూపింది. ఈ పాట భారత జాతీయవాదానికి సంబంధించింది. అలాంటి ప్రజల పాటలు ప్రత్యేకంగా రూపొందించబడలేదు. వాటిని ప్రజల మనస్సులపై రుద్దలేదు. వారు దీన్ని స్వయంగా ఉన్నత శిఖరాలకు చేర్చారు. మనస్సుకి హత్తుకున్నారు. 1937లో ఉత్తరప్రదేశ్ శాసనసభ పురుషోత్తం స్పీకర్‌గా అధ్యక్షత వహించినప్పుడు వందేమాతరంను పాడటం ప్రారంభించారు అని ఆయన రాశారు. వందేమాతర గీతాన్ని నవలా రచయిత బకించంద్ర ఛటర్జీ తన నవల ఆనంద్‌మఠ్‌లో భాగంగా నవంబర్ 7న 1875లో రాశారు. 1950 జనవరి 24న రాజ్యాంగ సభ భారత జాతీయ గీతంగా స్వీకరించింది. కాంగ్రెస్ 1937లో జాతీయ గీతంగా స్వీకరించింది.

# బీహార్ ఎంపీ రెండు చేతుల వేళ్లకు ఎన్నికల సిరా..

## రెండు ఓట్లు వేసినట్లు ఆరోపణలు

**పాట్నా నవంబర్ 7 ( ప్రభ )**
బీహార్ ఎంపీ రెండు చేతుల వేళ్లకు ఎన్నికల సిరా గుర్తులున్నాయి. మీడియాకు ఆమె తన రెండు చేతి వేళ్లను చూపించింది. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో ఆ ఎంపీ రెండు ఓట్లు వేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. బీహార్ అసెంబ్లీ ఎన్నికల తొలిదశ పోలింగ్ గురువారం జరిగింది. ఎన్డీయే కూటమికి చెందిన లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) సమస్తిపూర్ ఎంపీ శాంభవి చౌదరి తన కుటుంబంతో కలిసి ఓటు వేశారు. ఆ తర్వాత జేడీ(యూ) నాయకుడైన తండ్రి అశోక్



చౌదరి, తల్లి నీతాతో కలిసి ఫొటోలకు ఆమె ఫోజులిచ్చారు.కాగా, ఈ సందర్భంగా ఎంపీ శాంభవి చౌదరి తొలుత తన కుడి చేతిని పైకి లేపారు. కుడి చూపుడు వేలిపై ఉన్న సిరా గుర్తును చూపించారు. కొంత గందరగోళానికి గురైన ఆమె వెంటనే ఎడమ చేతిని పైకి ఎత్తారు. ఆ చేతి వేలిపై కూడా సిరా గుర్తు ఉన్నది. మరోవైపు ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో ఎంపీ శాంభవి చౌదరిపై విమర్శలు వెల్లువెత్తాయి. ఆమె ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడిందని, రెండు ఓట్లు వేసినట్లు కొందరు ఆరోపించారు. కెమెరా ముందు ఆమె తడబాటు దీనిని రుజువు చేస్తున్నదని కొందరు విమర్శించారు. అయితే ఎంపీ శాంభవి చౌదరి లేదా ఎన్నికల కమిషన్ ఈ వీడియో క్లిప్‌పై స్పందించలేదు.

# న్యాయ విజ్ఞాన సదస్సులో విద్యార్థులకు చట్టాలపై అవగాహన



**కరీంనగర్,నవంబర్ 07 ప్రభ**
జాతీయ న్యాయ సేవాధికార సంస్థ దినోత్సవాన్ని పురస్కరించుకుని కొత్తపల్లి హవేలీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కే. వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు రాజ్యాంగ హక్కులు, భద్రతా చట్టాలపై అవగాహన కల్పించారు. జాతీయ న్యాయ సేవల టోల్ ఫ్రీ నెంబర్ 15100, మాదక ద్రవ్యాల నిరోధక, సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్లు గుర్తుంచుకోవాలని సూచించారు. బాలికలు ధైర్యంగా ఉండాలని, సమస్య తలెత్తితే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా న్యాయ సేవా సంస్థకు సమాచారం ఇవ్వాలని సూచించారు.చెడు కోసంగా మొబైల్ వాడకానికి సంబంధించిన దుష్పరిణామాలను వివరించారు. కార్యక్రమంలో లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేష్, ప్రధానోపాధ్యాయులు కన్నం రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# "విద్యార్థుల మేధాశక్తే ప్రయోగశాల"

### శాతవాహన విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో గవర్నర్ సందేశం



**కరీంనగర్, నవంబర్ 07 ప్రభ**
శాతవాహన విశ్వవిద్యాలయ రెండో స్నాతకోత్సవంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్, కులపతి జిష్ణు దేవ్ వర్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 25 మందికి పీహెచ్డీ పట్టాలు, 2018 –2023 మధ్య ప్రతిభ కనబరిచిన 161 మంది విద్యార్థులకు బంగారు పతకాలు అందజేశారు. విద్యార్థులను ఉద్దేశించి గవర్నర్ మాట్లాడుతూ, "నిరంతర అభ్యాసమే విజయానికి మార్గం. శ్రద్ధ, క్రమశిక్షణతో లక్ష్యాన్ని చేరుకోవచ్చు. విద్యార్థుల మేధాశక్తే వారి ప్రయోగశాల. భయం, అలసటను అధిగమించి నైపుణ్యంతో ముందుకు సాగాలి" అని సూచించారు. విశ్వవిద్యాలయం న్యాక్, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌ల దిశగా అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పిలుపునిచ్చారు. "విద్య బోర్డు, చాక్‌పీస్‌లకే పరిమితం కాకుండా సాంకేతికత, పోటీ తత్వంతో ముందుకు సాగాలి. ఆధునిక నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలి" అని గవర్నర్ పేర్కొన్నారు.

# గీతా మందిరంలో "వందేమాతరం" 150 ఏళ్ల వేడుకలు



**కరీంనగర్, నవంబర్ 07 ప్రభ**
వందేమాతరం గీతం 150వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం 10 గంటలకు కరీంనగర్ గీతా మందిరంలో గీత భక్త సమాజం సభ్యులు జాతీయ గేయాన్ని సమిష్టిగా ఆలపించారు. కార్యక్రమంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందేశాలు వినిపించాయి.అధ్యక్షుడు బండ సత్తయ్య నేతృత్వంలో నిర్వహించిన ఈ వేడుకల్లో ఉప్పల రామేశం, చిట్టీమల్ల దామోదర్, కాసం సుదర్శనం, గుండ రాధా కిషన్, మరియాల రవీందర్ తదితర ధార్మిక సంస్థల ప్రతినిధులు, మహిళా భక్తులు పాల్గొన్నారు. దేశభక్తి భావాలను నూరిపోసేలా ఈ కార్యక్రమం సాగింది.

# ఘనంగా డివైఎఫ్ఐ 46వ ఆవిర్భావ దినోత్సవం



**కరీంనగర్, నవంబర్ 07 ప్రభ**
డివైఎఫ్ఐ 46వ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు నాయక్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి మాట్లాడుతూ, "భగత్ సింగ్ స్ఫూర్తితో నిరుద్యోగ యువత కోసం పోరాడే దేశవ్యాప్తంగా ఉన్న అతిపెద్ద యువజన సంఘం డివైఎఫ్ఐ" అని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ భర్తీలో విఫలమయ్యాయని విమర్శించిన ఆయన, రానున్న రోజుల్లో యువత ఉద్యోగ అవకాశాల కోసం పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రవీందర్, భూపతి రమేష్, మహేష్, అభిలాష్, మోజస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# విద్యకు తూట్లు పొడుస్తున్న ప్రభుత్వం...

### ప్రజా సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు కుసిన కార్తిక్



**భద్రాచలం : నవంబర్ 7 ( ప్రభ )**
పేద విద్యార్థులైన తెలంగాణ ఎస్సీ ఎస్టీ బీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ ఇవ్వకుండా వారిని విద్యకు దూరం చేయాలని చూస్తున్నదని ఖజానాలో డబ్బులు లేవు అని బుకాయిస్తున్నదని ప్రజా సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు కుస్సినా కార్తీక్ విమర్శించ్చారు. ఈ సందర్భంగా కార్తీక్ ఒక ప్రకటనలో మాట్లాడుతూ13 లక్షల మంది విద్యార్థుల ఫీజు పెండింగ్లో ఉండటం వలన వారి భవిష్యత్తు ప్రమాదంలో పడిందని, డబ్బు లేదని డిప్యూటీ సీఎం చెప్పడం హస్యాస్పదం అని ఆయన అన్నారు.ఒకపక్క ఒక్కో విద్యార్థికి 35000 చెల్లించవలసి ఉండగా గత రెండేళ్లుగా కొన్ని కోట్ల రూపాయలు బకాయిలు పేరుకుపోవడంతో బెస్ట్ అవైలబుల్ స్కీం కింద అడ్మిషన్లు పొందిన విద్యార్థుల భవిష్యత్తు ప్రైవేటు పాఠశాలలో ప్రశ్నార్థకంగా మారుతున్నదనీ ఆయన అన్నారు. మరోపక్క ఉపాధ్యాయులకు జీతాలు ఇచ్చుకోలేని పరిస్థితిలో కాలేజీ యజమాన్యాలు ఉన్నాయి. ఫీజు రీయింబర్స్మెంట్స్ స్కాలర్షిప్ కోసం ప్రభుత్వం చర్చలు జరిపిన అనంతరం ప్రభుత్వం 12000 కోట్లు టోకెన్లు ఇచ్చింది కానీ దీపావళి నాటికి 300 కోట్లు మాత్రమే విడుదల చేసిన తన అలవాటుగా వాగ్దాన బంగానికి పాల్పడింది. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం విద్యార్థులకు ఇవ్వాల్సిన ఫీజు రీఎంబర్స్మెంట్ మరియు స్కాలర్షిప్ గత ఆరేళ్ల నుండి ప్రభుత్వం చెల్లించడం లేదని ఆయన పేర్కొన్నారు . తక్షణమే పెండింగ్లో ఉన్నటువంటి 8500 కోట్లు పైచిలుక బకాయిలను చెల్లించాలని లేనియెడల తెలంగాణ నిరుపేద విద్యార్థుల ఆగ్రహానికి గురికాక తప్పదని ఆయన హెచ్చరించారు

# కలెక్టరేట్ సందర్శించిన గవర్నర్




**కరీంనగర్, నవంబర్ 07 ప్రభ**
శాతవాహన విశ్వవిద్యాలయ కార్యక్రమం అనంతరం కరీంనగర్ కలెక్టరేట్‌కి చేరుకున్న తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం విభాగాల వారీగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. వందేమాతరం గీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించగా, బాలభవన్ విద్యార్థులు శాస్త్రీయ నృత్యం, దేశభక్తి గీతాలతో ఆకట్టుకున్నారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, అదనపు కలెక్టర్లు అశ్విని, తానాజీ, వాకాడే, లక్ష్మి, కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నల్లకుంట జిహెచ్ఎస్ లో వందేమాతరం 150వ వార్షికోత్సవ వేడుకలు



**నల్లకుంట, నవంబర్ 07 ప్రభ**
వందేమాతరం గీతం 150 ఏళ్ల పుర్తిని పురస్కరించుకుని నల్లకుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, విద్యార్థులు సామూహికంగా గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు ముత్యాల రవీందర్ మాట్లాడుతూ, "వందేమాతరం గీతం భారత స్వాతంత్ర్య ఉద్యమానికి ప్రేరణగా నిలిచింది. బంకించంద్ర ఛటర్జీ 1875లో రచించిన ఈ గీతం 'బంగ దర్శన్' పత్రికలో మొదటగా వెలువడి, అనంతరం 'ఆనంద మఠ్' నవలలో స్థానం పొందింది" అని వివరించారు.విదేశీ పాలనలో అణచివేతను ధిక్కరించే నినాదంగా వందేమాతరం దేశవ్యాప్తంగా విస్తరించి, ఉద్యమకారులకు స్ఫూర్తిగా నిలిచిందని తెలిపారు. 1950 జనవరి 24న డాక్టర్ రాజేంద్రప్రసాద్ నేతృత్వంలో దీనిని అధికారికంగా జాతీయ గీతంగా ప్రకటించారని గుర్తు చేశారు.కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి భవానీ, ఉపాధ్యాయులు నాగమణి, భాగ్యలక్ష్మి, అనిల్ కుమార్, రమేష్, విమల, నీరజ, సంధ్య రాణి, అనిత, శివకళ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల దేశభక్తి భావాన్ని నింపేలా ఈ వేడుకలు సాగాయి.

# భరణం పెంచాలని సుప్రీంకోర్టును ఆశ్రయించిన షమీ భార్య

**న్యూఢిల్లీ -నవంబర్ 07 ప్రభ**
టీమ్ ఇండియా స్టార్ పేసర్ మహ్మద్ షమీ మాజీ భార్య హసీన్ జహాన్ రూ.4 లక్షల భరణం సరిపోవడం లేదని సుప్రీంకోర్టును ఆశ్రయించారు. నెలకు కనీసం రూ.10 లక్షలు భరణంగా నిర్ణయించాలని ఆమె కోరారు. పెరుగుతున్న జీవన వ్యయాలను, షమీ అధిక ఆదాయాన్ని పరిగణలోకి తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు షమీకి నోటీసులు జారీ చేసి, ఆయన సమాధానం కోరింది. "నెలకు రూ.4 లక్షలు ఇప్పటికే పెద్ద మొత్తం కాదా?" అని కోర్టు వ్యాఖ్యానించింది. తదుపరి విచారణ

# వెంకట్రావుపల్లిలో వందేమాతరం గీతాలాపన



**రామడుగు, నవంబర్ 07 ప్రభ**
వందేమాతరం గీతం 150వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వెంకట్రావుపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో సామూహిక గీతాలాపన నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు జ్యోతిర్మయి మాట్లాడుతూ, "వందేమాతరం గీతం స్వాతంత్ర్య చైతన్యాన్ని నింపి దేశాన్ని ఏకం చేసింది" అని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దేవి శెట్టి, ఆంజనేయులు, మిట్టేపల్లి రవీందర్, శ్రీలత, శ్యామ దత్తు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# డాక్టర్ సత్య ప్రకాష్‌కు ప్రాంతీయ సమన్వయ అధికారిగా బాధ్యతలు



**కరీంనగర్, నవంబర్ 07 ప్రభ**
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం ప్రాంతీయ సమన్వయ అధికారిగా డాక్టర్ ఎం. సత్య ప్రకాష్ బాధ్యతలు స్వీకరించారు.ఇదివరకు ఈ పదవిలో ఉన్న డాక్టర్ వంగల శ్రీనివాస్ ఉద్యోగ విరమణ పొందిన నేపథ్యంలో, కరీంనగర్ శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో సత్య ప్రకాష్ బాధ్యతలు చేపట్టారు. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కల్వకుంట రామకృష్ణ, టిజిసి జిటిఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విభాగాధిపతులు, బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# రామడుగులో ఉపన్యాసం, వ్యాసరచన, క్విజ్ పోటీలు



**రామడుగు, నవంబర్ 07 ప్రభ**
టి-సాట్, గెజిటెడ్ హెడ్మాస్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మండల స్థాయి పోటీలు నిర్వహించారు.మండల విద్యాధికారి జి.పి.వి. రంగనాథ శర్మ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, పోటీ మనోభావం పెంపొందించేందుకు ఇలాంటి పోటీలు దోహదం చేస్తాయని విద్యాధికారి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మదిగట్ల-మోజర్ల పాఠశాలలో వందేమాతరం గీతం ఆలాపన

**- ఎస్.వరప్రసాద్ రావు జి.హెచ్.ఎం ప్రధానోపాధ్యాయులు**



**వనపర్తి జిల్లా నవంబర్ 07 ప్రభ**

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మద్దిగట్ల-మోజర్ల పెద్దమందడి మండలము నందు, జిల్లా కలెక్టర్ శ్రీ ఆదర్శ గారి ఆదేశానుసారము.సరే సరే వందేమాతర గీతానికి 150 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా పాఠశాల యందు ప్రధానోపాధ్యాయులు ఎస్ వరప్రసాదరావు, ఈ సందర్భంగా జి.హెచ్.ఎం ఎస్.వరప్రసాదరావు మాట్లాడుతూ,1875 వ సంవత్సరము నవంబర్ 7వ తేదీన వందేమాతర గీతానికి అంకురార్పణ జరిగిందని,బంకిమ్ చంద్ర చటర్జీ తన ఆనందమఠ నవల ద్వారా ఈ గీతానికి విశేష ప్రాచుర్యాన్ని కల్పించడం జరిగింది అన్నారు.అలాగే స్వాతంత్ర ఉద్యమ పోరాటంలో ఈ వందేమాతర గీతం అందరినీ ఏకతాటిపై ఐకమత్యంతో స్వాతంత్ర పోరాటానికి స్ఫూర్తిదాయకమైందని తెలియజేశారు, మహాత్మా గాంధీ , జవహర్లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్,నేతాజీ సుభాష్ చంద్రబోస్,లాలా లజపతిరాయ్, సరోజినీ నాయుడు మొదలగు ముఖ్య నాయకులు ఈ గీతానికి విశేషమైన ప్రాచుర్యం కల్పించడం జరిగిందని తెలిపారు.ఈ కార్యాక్రమంలో, ఉపాధ్యాయ బృండం, వి.వాణిప్రభ, పుల్లయ్య,గద్వాల కృష్ణ,ఎన్.వెంకట్ స్వామి,ఏ.భగవంతు, ఎన్.శ్రీనివాసులు, చిన్నారెడ్డి,ఏ.వెంకట్ స్వామి,ఏబీవీబీ కార్యకర్తలు,, గ్రామస్తులు అందరు కలిసి సామూహికంగా వందేమాతరం గీతాన్ని ఆలపించడం జరిగింది.

## వందే మాతర గీతం ఆలపించిన పెళ్లి బృందం

**- అశ్విని రాధమ్మ జిల్లా బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు వనపర్తి**



**వనపర్తి జిల్లా నవంబర్ 07 ప్రభ**

కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన అదేశాల మేరకు, వందేమాతర గీతంతో జాతీయ సమైక్యత ఆత్మగౌరవం పెంపొందుతుందని అశ్విని రాధమ్మ అన్నారు.ఈ సందర్భంగా అశ్విని రాధమ్మ మాట్లాడుతూ, వనపర్తి కేడిఆర్ అశ్విని గోవింద్ కుమార్తె పెళ్ళి కి, మారు మునగాల గ్రామానికి డీసీఎం లో వెళ్తు, ప్రయాణం లో దాదాపు సమయం:10:

గంటలకు పెళ్ళి బృందం వందేమాతరం జాతీయ గీతం ఆలపించినారు. వందేమాతర గీతం రచించి 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన గీతాలాపన లో కలిసి వందేమాతర గీతాన్ని ఆలపించారు.150 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రత్యేక ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రతి పౌరుడు లో దేశభక్తి భావాన్ని మరింతగా పెంపొందించేందుకు దేశ చరిత్రలో వందేమాతర గీతానికి ల ప్రాధాన్యతను చాటి చెప్పేందుకు వీలుగా సామూహిక గీతాలాపన కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో, ప్రైవేట్ టీచర్స్ శిరీష, హారిక,సాయి రమ్య, మరియు ప్రభుత్వ టీచర్స్ విష్ణు,శరత్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వధించిన

**- ఆగారం ప్రకాష్ కాంగ్రెస్ మండల నాయకులు ఘనపూర్**



**వనపర్తి జిల్లా నవంబర్ 07 ప్రభ**

ఖిల్లా ఘనపూర్ మండల కేంద్రానికి చెందిన, సక చెన్నకేశవులు కమలమ్మ కుమార్తె,వివాహనకి పద్మా శాలి ఫంక్షన్ హాలో జరిగిన వివాహ కార్యక్రమానికి వారి ఆహ్వానం మేరకు వెళ్లి ఆగారం ప్రకాష్ నూతన దంపతులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఆ నూతన దంపతులను మీ వైవాహిక జీవితం అంతులేని ప్రేమ మరియు ఆనందంతో నిండిపోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ, నూతన వధూవరులు సుఖ సంతోషాలతో నిండు నూరేళ్లు కలకాలం వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ చిన్నగా,మధురంగా:"కలకాలం కలిసి, నవ్వుతూ, ఆనందంగా జీవించాలని కోరుకుంటూ అవధులు లేని ప్రేమానురాగాలతో మీ దాంపత్య జీవితం ఎల్లప్పుడూ సంతోషంగా సాగిపోవాలని కోరుకుంటూ ఆ నవ దంపుతులను ఆశీర్వధించి వారి ఆదిత్యం తీసుకొని రావడం జరిగింది.ఈ వివాహ కార్యక్రమంలో పాల్గొన్న మండల మరియు గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ నవీన్ యాదవ్ గెలుపుకై ముమ్మరంగా ప్రచారం

**- పాల్గొన్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు భేరి రామచంద్ర యాదవ్**


**శేరిలింగంపల్లి నవంబర్ 07 ప్రభ**


ఎన్నికల ప్రచార గడువు ముగుస్తుండడం తో ఒక్కసారిగా ప్రచారం ఊపందుకుంది.జూబ్లీహిల్స్ ఎన్నికల సందర్భంగా యూసుఫ్ గూడా ఎర్రగడ్డ కళ్యాణ్ నగర్ కృష్ణానగర్ వివిధ ప్రాంతాలలో మహా పాద యాత్ర చేస్తూ ప్రచారం నిర్వహించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ని భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీనీ గెలిపించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఈ సందర్భంగా ఓటర్ లను కోరారు. నవీన్ యాదవ్ ప్రతినిత్యం ప్రజలలో ఉంటూ ప్రజల కష్టసుఖాలలో



పాలుపంచుకుంటూ ఎవరికి ఏ ఆపద వచ్చినా అందరికీ అండదండగా ఉంటూ అందరివాడు అనిపించుకున్న నవీన్ యాదవ్ ప్రజలు ఆశీర్వదించాలి అని . జూబ్లీహిల్స్ అభివృద్ధి చెందాలంటే నవీన్ యాదవ్ నీ గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు భేరి రామచంద్ర యాదవ్, బిసి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్కే సాయన్న ముదిరాజ్, బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి రామకృష్ణ గౌడ్, పాములేటి యాదవ్, ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం ప్రధాన కార్యదర్శి డబ్బు కొట్టు హరిబాబు యాదవ్, గొర్రెల మేకల సహకార సంఘాల జిల్లా అధ్యక్షులు మధు యాదవ్, సినిమా ఆర్టిస్ట్ లక్ష్మీనారాయణయాదవ్, స్థానిక కాంగ్రెస్ పార్టీ అభిమానులు, కార్యకర్తలు మ బిసి, ఎస్సీ ఎస్టీ మైనార్టీ కుల సంఘాల నాయకులు, ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా నవీన్ యాదవ్ ను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు.

# నూతన వధూవరులను ఆశీర్వధించిన





**- టి.సాయి చరణ్ రెడ్డి వనపర్తి జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు**

**ఘనపూర్/ నవంబర్ 07 ప్రభ**

ఖిల్లా ఘనపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయకుమార్ కుమార్తె వివాహ కార్యక్రమానికి వారి ఆహ్వానం మేరకు వెళ్లి ఆ నూతన దంపతులను ఆశీర్వదించిన టీ. సాయి చరణ్ రెడ్డి. మరియు మండల కాంగ్రెస్ నాయకులు ఆగారం ప్రకాష్. ఈ సందర్భంగా టి.సాయి చరణ్ రెడ్డి మాట్లాడుతూ, మీ వైవాహిక జీవితం అంతులేని ప్రేమ మరియు ఆనందంతో నిండిపోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ,నూతన వధూవరులు సుఖ సంతోషాలతో నిండు నూరేళ్లు కలకాలం వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ.. కలకాలం కలిసి, నవ్వుతూ, ఆనందంగా జీవించాలని కోరుకుంటూ,అవధులు లేని ప్రేమానురాగాలతో మీ దాంపత్య జీవితం ఎల్లప్పుడూ సంతోషంగా సాగిపోవాలని కోరుకుంటూ..ఆ నవ దంపుతులను ఆశీర్వధించి వారి ఆదిత్యం తీసుకొని రావడం జరిగింది.ఈ వివాహ కార్యక్రమంలో పాల్గొన్న మండల మరియు గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ సేవా భావంను పెంపొందించుకోవాలి

**- హపీజ్ పేట్ డివిజన్ కంటస్టెడ్ కార్పొరేటర్ బోయిని అనూష మహేష్ యాదవ్**

**శేరిలింగంపల్లి నవంబర్ 07 ప్రభ**

హఫీజ్ పేట్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ హఫీజ్ పేట్ వద్ద బీజేపీ హఫీజ్ పేట్ డివిజన్ కి చెందిన బిజెపి కాంటెస్టెడ్ కార్పొరేటర్ బోయిని అనూష మహేష్ యాదవ్ జన్మదిన సందర్భంగా ఓల్డ్ హఫీజ్ పేట్,హుడా కాలనీ, గంగారాం, చందానగర్ రైల్వే స్టేషన్ మరియు పరిసర ప్రాంతాల్లో బీజేపీ సీనియర్ నాయకులు కలిసి వారికి శుభాకాంక్షలు తెలుపుతూ కేక్ కట్ చేసి తదనంతరం ఆహారం పాకెట్స్ ను పంపిణీ చైయడం జరిగింది.ఈ కార్యక్రమానికి మాజీ



కౌన్సిలర్ రమణయ్య బీజేపీ జిల్లా నాయకులు రవి గౌడ్ తదితరులు అతిథి లుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా భావంను పెంపొందించుకోవాలి అని అన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ సేవ కార్యక్రమాలు చేపట్టి ప్రధాని నరేంద్ర మోదీ చూపిన బాటలో ప్రతి ఒక్కరూ ఈ సేవ కార్యక్రమంలో మనమందరం ముందుండి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా పని చేయాలని ఈ సందర్భంగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు జగన్ గౌడ్ ,రాజు ముదిరాజ్ ,బాబు రెడ్డి ,శ్రీనివాస్ యాదవ్ ,పవన్, నర్సింహా యాదవ్,పాలం శ్రీనివాస్ ,నవీన్,దేవేందర్ దాస్ ,రాజేష్ ,రామారావు , సుబ్బారావు, వినయ్, రాజు,శ్రీను, రాములు, కుమార స్వామి, అనిల్, శివ, చందు, బిజెపి పార్టీ కి చెందిన నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్కాట్స్ & గైడ్స్ ఫౌండేషన్ డే మెదక్‌లో ఘనంగా ర్యాలీ

**- మెదక్ జిల్లా అడిషనల్ కలెక్టర్,డీఈఓ చేతుల మీదుగా ర్యాలీ ప్రారంభం**
**- ప్రతిభ చూపిన స్కాట్స్, గైడ్స్ విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రధానం**

**మెదక్ నవంబర్ 07 ప్రభ**

జాతీయ స్కాట్స్ & గైడ్స్ ఫౌండేషన్ డే సందర్భంగా, మెదక్ పట్టణంలో భారత్ స్కాట్స్ & గైడ్స్ మెదక్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మెదక్ జిల్లా అడిషనల్ కలెక్టర్ మెంచు నగేష్,మెదక్ జిల్లా డీఈవో రాధాకిషన్,ఎం జె పి బీసీ గురుకులాల మెదక్ జిల్లా ఆర్ సి ఓ జె.రాజేశం,డి ఎస్ ఓ రాజిరెడ్డి హాజరయ్యారు. వీరంతా జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.ఈ ర్యాలీ మెదక్ పట్టణంలోని కొత్త బస్టాండ్ నుండి రాందాస్ చౌరస్తా వరకు జరిగింది. తదనంతరం,మహాత్మా జ్యోతిభాపూలే బీసీ గురుకుల






పాఠశాలలో స్కాట్స్ & గైడ్స్ విద్యార్థులకు క్యాంపింగ్ టెస్ట్ నిర్వహించారు.విద్యార్థులు వేసిన గూడారాలను అతిథులు పరిశీలించారు. స్కాట్స్, గైడ్స్ శిక్షణలో ప్రతిభ చూపిన విద్యార్థులకు మెదక్ జిల్లా అడిషనల్ ఎస్పీ శ్రీ మహేందర్ సర్ చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ రేంజర్స్ కమిషనర్ శ్రీజన,డిస్ట్రిక్ట్ జనరల్ సెక్రటరీ ఇప్ప రాజేందర్,డిస్ట్రిక్ట్ డిటిసి లు తలారి నాగరాజు,బట్టి జ్యోత్స,డిటిసి కుల్ల మహిపాల్,స్కాట్స్ మాస్టర్స్, గైడ్ మాస్టర్స్, లైబ్రేరియన్ బుర్ర సంతోష్, మరియు ఇతర ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# బిజినెస్

## వరుసగా నాలుగో రోజూ బంగారం ధర తగ్గుముఖం



ఇంటర్నెట్ డెస్క్:
దేశంలో బంగారం ధర కొంచెం.. కొంచెంగా అక్కరకొస్తోంది. గత మూడు రోజులుగా తగ్గుతూ వస్తున్నబంగారం ధరలు నాలుగో రోజు కూడా తగ్గాయి. దీపావళి తర్వాత నుంచి తగ్గుతూ వస్తున్న బంగారం, వెండి ధరలు నేడు వరుసగా నవంబర్ 7వ తేదీ శుక్రవారం కూడా తగ్గాయి. దీపావళికి 1,31,000 రూపాయలు పలికిన బంగారం ధర ఇప్పుడు, తులంపై దాదాపు 9 నుంచి 10వేలు తగ్గింది. హైదరాబాద్ మార్కెట్‌లో 24 క్యారెట్ల (999) స్వచ్ఛమైన బంగారం ధర గ్రాముకు రూ. 12,202 వద్ద ఉంది. ఇది నిన్నటి ధర రూ.12,257 కంటే రూ.55 తగ్గింది. అదేవిధంగా, ఆభరణాల తయారీలో ఎక్కువగా ఉపయోగించే 22 క్యారెట్ల బంగారం ధర గ్రాముకు రూ.11,188 వద్ద నడుస్తోంది. నిన్నటి కంటే రూ.47 తగ్గింది. ఇక, 18 క్యారెట్ల బంగారం ధర కూడా కాస్త తగ్గి, గ్రాముకు రూ.9,152 వద్ద ఉంది. ఇది రూ.41 మేర తగ్గింది.

## 55-అంగుళాల స్మార్ట్ టీవీ కేవలం 20,999కే.. అద్భుతమైన ఫీచర్స్

మీరు 55 అంగుళాల స్క్రీన్ సైజు ఉన్న పెద్ద టీవీని కొనాలని ప్లాన్ చేస్తుంటే మీ బడ్జెట్ తక్కువగా ఉంటే చింతించకండి. 21,000 రూపాయల కంటే తక్కువ ధరకే ఆకట్టుకునే ఫీచర్లతో కూడిన స్మార్ట్ టీవీని కొనుగోలు చేయవచ్చు. ఇది 55 అంగుళాల స్క్రీన్‌తో వస్తుంది. మీరు ఈ టీవీని ఎక్కడ కొనుగోలు చేయవచ్చు? ఇందులో ఏయే ఫీచర్స్ ఉన్నాయో తెలుసుకుందాం.

ఫ్లిప్‌కార్ట్‌లో లభించే ఈ 55-అంగుళాల స్మార్ట్ టీవీ 61% తగ్గింపు తర్వాత రూ.20,999కి లభిస్తుంది. అయితే, మీరు రూ.79 ప్రొటెక్ట్ ప్రామిస్ ఫీజు కూడా చెల్లించాల్సి ఉంటుందని గమనించండి. కంపెనీ ఒక సంవత్సరం వారంటీని కూడా అందిస్తుంది. మీరు EMI ఆప్షన్‌తో టీవీని కొనుగోలు చేయాలనుకుంటే ఫ్లిప్‌కార్ట్ నో-కాస్ట్ EMI ఆప్షన్‌లను కూడా అందిస్తుంది. ఈ టీవీని నెలకు రూ.2,334 నుండి ప్రారంభమయ్యే నో-కాస్ట్ EMI తో కొనుగోలు చేయవచ్చు.

**55 అంగుళాల టీవీ:**




గూగుల్ టీవీ ఆపరేటింగ్ సిస్టమ్‌పై నడుస్తున్న ఈ టీవీ అమెజాన్ ప్రైమ్ వీడియో, జియో హాట్‌స్టార్, నెట్‌ఫ్లిక్స్, యూట్యూబ్ వంటి యాప్‌లను సపోర్ట్ చేస్తుంది. 60Hz రిఫ్రెష్ రేట్‌తో వస్తున్న ఈ టీవీ 20W సౌండ్ అవుట్‌పుట్‌ను కూడా అందిస్తుంది. 4K అల్ట్రా రిజల్యూషన్, డాల్బీ ఆడియో, HDR 10, గూగుల్ టీవీ 5.0, 32GB ఇంటర్నల్ స్టోరేజ్, క్రోమ్‌కాస్ట్, మిరాకాస్ట్, ఎయిర్‌ప్లే, ఐకేర్ వంటి ఫీచర్లు కూడా ఈ టీవీలో ఉన్నాయి. 55-అంగుళాల స్క్రీన్ సైజుతో వస్తున్న ఈ టీవీ గూగుల్ వాయిస్ అసిస్టెంట్, వాయిస్ వాల్‌పేపర్ వంటి గొప్ప ఫీచర్లను కూడా అందిస్తుంది. ఈ ధరల శ్రేణిలో మీరు కూకా, బ్లాపంక్ట్, థామ్సన్, కెన్‌స్టార్ వంటి బ్రాండ్‌ల నుండి టీవీలను కనుగొంటారు. కంపెనీలు సాధారణంగా ఈ ధరల శ్రేణిలో 43-అంగుళాల టీవీలను విక్రయిస్తాయి. కానీ కొన్ని 50-అంగుళాల టీవీల కోసం కస్టమర్ల అవసరాలను కూడా తీరుస్తాయి.

## స్ట్రింగ్ మెటావర్స్ రెవెన్యూలో 165 శాతం వృద్ధి


హైదరాబాద్
ప్రముఖ వెబ్3 ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ గేమింగ్ కంపెనీ స్ట్రింగ్ మెటావర్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో 165.41 శాతం వృద్ధితో రూ.233.27 కోట్ల రెవెన్యూ సాధించింది. హైదారబాద్ కేంద్రంగా పని చేస్తోన్న ఈ సంస్థ గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.87.89 కోట్ల రెవెన్యూ నమోదు చేసింది. రూ.6.75 కోట్లుగా ఉన్న కంపెనీ నికర లాభాలు గడిచిన క్యూ2లో 220 శాతం వృద్ధితో రూ.21.64 కోట్లకు చేరాయి. 2025-26 ప్రథమార్థంలో రెవెన్యూ 213 శాతం పెరిగి రూ.432 కోట్లకు, నికర లాభాలు 229.18 శాతం వృద్ధితో రూ.39.93 కోట్లకు చేరాయి.




## ప్రపంచకప్ వేళ మహిళా క్రికెటర్‌కు లైంగిక వేధింపులు..

### విచారణ కమిటీ న్యాయం చేసేనా..?

మహిళా క్రికెట్‌లో సంచనలం రేపుతున్న బంగ్లాదేశ్ మాజీ పేసర్ జహనరా అలం వ్యాఖ్యలను బోర్డు, ప్రభుత్వం సిరీయస్‌గా తీసుకున్నాయి. మూడేళ్ల క్రితం వరల్డ్ కప్ సమయంలో సిబ్బంది ఒకరు తనను లైంగిక వేధింపులకు గురిచేశారని ఆమె యూట్యూబ్ ఛానెల్లో ఆరోపించించిన నేపథ్యంలో దోషులను పట్టుకునేందుకు సిద్దమైంది. జహనరాకు న్యాయం చేయాలని బంగ్లాదేశ్ యువత భగ్గుమనడంతో విచారణ కమిటీని ఏర్పాటు చేసింది ప్రభుత్వం. బాధితురాలైన జహనరాతో పాటు ఆమెను వేధించిన వ్యక్తిని విచారించి.. పదిహేను రోజుల్లో నివేదికను సమర్పించనుంది. మూడేళ్ల క్రితం జరిగిన టీ20 వరల్డ్ కప్‌లో పలువురు సహాయక సిబ్బంది లైంగిక వేధింపులకు పాల్పడ్డారని మాజీ పేసర్ చేసిన ఆరోపణలను సిరీయస్‌గా తీసుకున్నాం. ఇది సున్నితమైన విషయం కావడంతో నిజానిజాలు నిగ్గు తేల్చేందుకు విచారణ కమిటీని ఏర్పాటు చేశాం. ఈ వ్యవహారంపై లోతుగా విచారించి.. పదిహేను రోజుల్లో నివేదికను కమిటీ అందజేయనుంది అని శుక్రవారం ఒక ప్రకటనలో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు వెల్లడించింది. అంతేకాదు జహనరాకు అన్ని విధాల అండగా





ఉంటామని క్రీడా సలహాదారు అసిఫ్ మహమూద్ షోజిబ్ భుయైన్ పేర్కొన్నాడు. మహిళా అథ్లెట్లు, క్రీడాకారుల భద్రతకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని, ఎవరైనా వేధింపులకు పాల్పడినట్టు రుజువైతే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపాడు. లైంగిక వేధింపుల గురించి మాట్లాడిన జహనరాతో మాట్లాడుతాను. ఆమెకు అవసరమైతే న్యాయ సహాయం అందిస్తా. మహిళల్ని వేధించడం నేరం కనుక.. ప్రభుత్వ పరంగా ఆమెకు అండగా ఉంటాం. వేధింపులకు పాల్పడిన వ్యక్తులకు కఠినమైన శిక్ష విధిస్తాం' అని అసిఫ్ చెప్పాడు. అయితే.. జహనరాను వేధించిన వాళ్లు ప్రస్తుతం బంగ్లా బోర్డులో కీలక స్థానాల్లో ఉన్నారు. వీరిలో మాజీ పేసర్ మంజురుల్ అలామ్ ఒకడు. మహిళా క్రికెట్ సెలెక్టర్ అయిన అతడు చైనాలో ఇప్పుడు నివసిస్తున్నాడు.

పీరియడ్ ముగిశాక ..

బంగ్లాదేశ్ మహిళా క్రికెట్ గురించి మాజీ పేసర్ జహనరా ఆలం సంచలన వ్యాఖ్యలు చేసింది. ప్రస్తుతం కెప్టెన్‌గా ఉన్న నిగర్ సుల్తానా జూనియర్లను తన గదికి పిలుపించుకొని కొడుతుందని ఆరోపించింది. ఇటీవలే ముగిసిన వన్డే వరల్డ్ కప్ సమయంలోనూ నిగర్ తమను కొట్టిందని జూనియర్లు తనతో చెప్పారని జహనరా చెప్పింది. అంతేకాదు.. మూడేళ్ల క్రితం తాను ఎదుర్కొన్న లైంగిక వేధింపులపై ఆమె మాట్లాడింది. న్యూజిలాండ్ వేదికగా జరిగిన టీ20 వరల్డ్ కప్‌లో మాజీ పేసర్ మంజురుల్ ఇస్లాం మాపట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. అతడు మమ్మల్ని తన ఛాతికి దగ్గరగా లాక్కొనేవాడు. అంతేకాదు తన నోటిని మా చెవుల దగ్గర పెడుతూ చాలా ఇబ్బందికి గురిచేశాడు. మీ పీరియడ్ పూర్తికాగానే నాతో చెప్పండి. అప్పుడు నావైపు చూడండి అని అతడు మాపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు' అని జహనరా యూట్యూబ్ ఛానెల్లో భోరుమంది. పేసర్‌గా 2011లో అరంగేట్రం చేసిన జహనరా 2022లో వీడ్కోలు పలికింది

## వీడ్కోలు వార్తలకు చెక్.. ఐపీఎల్‌కు రెడీ అవుతున్న ధోనీ..!

ఐపీఎల్ అభిమానులకు గుడ్‌న్యూస్. వచ్చే సీజన్‌లో మహేంద్ర సింగ్ ధోనీ ఆడుతాడా? లేదా? అనే వార్తలకు ఎండ్‌కార్డ్ పడింది. ఫ్రాంచైజీ క్రికెట్‌లో రారాజుగా వెలుగొందుతున్న మహీ భాయ్ మరో సీజన్‌కు సన్నద్ధమవుతున్నాడు. శరీరం సహకరిస్తే మరో సీజన్ ఆడుతానని ఇదివరకే ప్రకటించిన ధోనీ.. మరోమారు పసుపు జెర్సీతో స్టేడియాలను దద్దరిల్లేలా చేయనున్నాడు. అవును.. ధోనీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయాన్ని క్రిక్‌బజ్‌తో చెన్నై సూపర్ కింగ్స్ సీఈఓ కాశీ విశ్వనాథన్ పంచుకున్నాడు. మీరు విన్నది నిజమే. ఐపీఎల్ 19వ సీజన్‌లో ధోనీ ఆడుతున్నాడు అని ఆయన తెలిపాడు. భారత కెప్టెన్‌గానే కాకుండా ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో తనదైన ఆటతో




అభిమానుల గుండెల్లో నిలిచిన ధోనీ.. వీడ్కోలు వార్తలకు చెక్ పెట్టాడు. మరో సీజన్‌కు నేను రెడీ అంటూ తనపై కొండంత ప్రేమ కురిపిస్తున్న చెన్నై సూపర్ కింగ్స్ , సీఎస్కే ఫ్యాన్స్‌ను సంబురాల్లో ముంచెత్తాడీ వెటరన్. శుక్రవారం 'క్రిక్‌బజ్'తో మాట్లాడిన సీఎస్కే సీఈఓ కాశీ విశ్వనాథన్ అమితానందంతో ఈ విషయాన్ని బహిర్గతం చేశాడు. వచ్చే సీజన్‌లో ఆడేందుకు నేను సిద్ధంగా ఉన్నాను అని ధోనీ మాతో చెప్పాడు. అతడి నిర్ణయం పట్ల చాలా సంతోషంగా ఉన్నాం. అనుభవజ్ఞుడైన ధోనీ యువతరానికి మార్గనిర్దేశనం చేయడంలో కీలకం కానున్నాడు' అని విశ్వనాథన్ పేర్కొన్నాడు. ఈ సందర్భంగా సంజూ శాంసన్ ను రాజస్థాన్ రాయల్స్ నుంచి కొనడంపై గురించి చర్చలు జరుగుతున్నాయని విశ్వనాథన్ తెలిపాడు. నవంబర్ 10, 11వ తేదీల్లో సీఎస్కే యాజమాన్యం, కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్, కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌తో ధోనీ సమావేశం అవుతాడని సమాచారం. సీఎస్కే భవిష్యత్ గురించి.. వేలంలో కొనాల్సిన ఆటగాళ్ల గురించి చర్చించే అవకాశముందని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి.

# స్పోర్ట్స్

## భారత పేసర్ల జోరుకు తలొగ్గిన సఫారీలు..

### -పంత్ సేనకు భారీ ఆధిక్యం..!



రెండో అనధికారిక టెస్టులో భారత 'ఏ' జట్టు పట్టు బిగించింది. తొలి ఇన్నింగ్స్‌లో ధ్రువ్ జురెల్(132 నాటౌట్) శతకంతో కోలుకున్న టీమిండియాను పేసర్లు గట్టెక్కించారు. ప్రసిధ్ కృష్ణ(3-35), ఆకాశ్ దీప్(2-28)లు నిప్పులు చెరగగా దక్షిణాఫ్రికాను 221కే ఆలౌట్ చేసి టీమిండియా ఆ తర్వాత భారీ ఆధిక్యం దిశగా సాగుతోంది. రెండోరోజు ఆట ముగిసే సరికి ఓపెనర్ కేఎల్ రాహుల్( 26 నాటౌట్), నైట్‌వాచ్‌మన్ కుల్దీప్ యాదవ్‌లు క్రీజులో ఉన్నారు. 3 వికెట్ల నష్టానికి 73 రుగులు చేసిన పంత్ బృందం ఆధిక్యం 112 పరుగులకు చేరింది. సంచలన ఆటతో మొదటి అనధికారిక టెస్టును హస్తగతం చేసుకున్న భారత ఏ జట్టు రెండో మ్యాచ్‌లోనూ పటిష్ట స్థితిలో నిలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో టాపార్డర్ విఫలమైనా.. ధ్రువ్ జురెల్(132 నాటౌట్) సూపర్ సెంచరీతో ఆదుకోగా.. భారత పేసర్లు వికెట్ల వేటతో సఫారీలను హడలెత్తించారు. ప్రసిధ్ కృష్ణ(3-35), ఆకాశ్ దీప్(2-28)లు చెలరేగగా.. సీనియర్ టీమ్ సారథి తెంబా బవుమా(0) డకౌట్‌గా వెనుదిరిగాడు. టాపార్డర్ కుప్పకూలినా కెప్టెన్ ఎంజే అకెర్‌మన్(134) టీమిండియా పేసర్లను దీటుగా ఎదుర్కొని అద్భుత శతకంతో రాణించాడు. కానీ, అతడికి సహకారం అందించేవారు కరువవ్వడంతో 221కే ఆలౌటయ్యింది.

జురెల్ ఒంటరి పోరాటంతో

తొలి ఇన్నింగ్స్‌లో సఫారీ పేసర్ టియాన్ వాన్ వురేన్ (4-54) ధాటికి భారత ప్రధాన ఆటగాళ్లు చేతులెత్తేశారు. భారీ స్కోర్లు చేస్తారనుకుంటే కేఎల్ రాహల్(19), కెప్టెన్ రిషభ్ పంత్(24)లు నిరాశపరచగా.. జట్టును గట్టెక్కించే బాధ్యతను భుజాన వేసుకున్న జురెల్ గొప్ప ఇన్నింగ్స్ ఆడాడు. 119-6తో ఆలౌట్ అంచున నిలిచిన జట్టు ఆపద్బాదంవుడి పాత్ర పోషించిన జురెల్ టెయిలెండర్లు కుల్దీప్ యాదవ్(20), మహమ్మద్ సిరాజ్(15)లతో విలువైన భాగస్వామ్యాలు నెలకొల్పాడు. అయితే ప్రసిధ్ కృష్ణ(0)ను ఔట్ చేసిన వురేన్ 255 వద్ద భారత ఇన్నింగ్స్‌కు తెరదించాడు.




## మలయాళంలో ఎంట్రీ ఇస్తున్న అనుష్క..

### 'కథనార్' నుంచి ఫస్ట్ లుక్ విడుదల

టాలీవుడ్ భామ అనుష్క శెట్టి మలయాళం ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇవ్వబోతున్న సంగతి తెలిసిందే. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం కథనార్. ఈ సినిమాకు రోజిన్ థామస్ దర్శకత్వం వహిస్తుండగా.. ప్రముఖ నిర్మాత గోకులం గోపాలన్ నిర్మిస్తున్నాడు. హారర్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ చిత్రం రాబోతుండగా.. ఈ చిత్రంలో జయసూర్య, ప్రభుదేవ, ప్రేమదేశం వినీత్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. అయితే నేడు అనుష్క శెట్టి పుట్టినరోజు సందర్భంగా ఆమెకి శుభాకాంక్షలు తెలుపుతూ చిత్రబృందం అనుష్క ఫస్ట్ లుక్‌ని విడుదల చేసింది. ఈ చిత్రంలో అనుష్కా నీలా అనే పాత్రలో కనిపించబోతున్నట్లు ప్రకటించింది.

## అదిరిపోయే లుక్‌లో శ్రీలీల..

### చూపులతోనే హీటెక్కిస్తుందిగా..

పెళ్లి సందడి మూవీతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన బ్యూటీ శ్రీలీల. ఈ అందాల ముద్దుగుమ్మ మొదటి సినిమాతోనే తన అందంతో అందరినీ తన వైపుకు తిప్పుకుంది, అందమే కాకుండా ,డ్యాన్స్, నటనతో అందరినీ మాయ చేసి, యూత్‌లో మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకుంది. ఈ మూవీ తర్వాత ఈ అందాల చిన్నదానికి వరసగా అవకాశాలు క్యూ కట్టాయి.తర్వాత మాస్ మహారాజా రవితేజ సరసన ధమాకా సినిమాలో నటించి, మంచి క్రేజ్ సంపాదించుకుంది. ఈ మూవీలో ఈ అమ్మడు డాన్స్, నటనతో విమర్శకుల నుంచి సైతం ప్రశంసలు అందుకొని, టాలీవుడ్ క్రేజీ హీరోయిన్‌గా మంచి పేరు సంపాదించుకుంది. ఇక ఈ మూవీ తర్వాత ఈ బ్యూటీకి వరసగా అవకాశాలు తలుపు తట్టాయి.వరసగా, గుంటూరు కారం, ఆది కేశవ, ఎక్స్‌ట్రార్డినరీ మ్యాన్, భగవంత్ కేసరి, స్కంద వంటి చాలా సినిమాల్లో నటించింది. కానీ సినిమాలు అన్నీ డిజాస్టర్ అవ్వడంతో ఈ బ్యూటీ క్రేజ్ అమాంతం తగ్గిపోయింది. దీంతో కొన్ని రోజుల వరకు టాలీవుడ్‌కు కాస్త బ్రేక్ ఇచ్చిన ఈ బ్యూటీ మళ్లీ, పుష్ప2 మూవీలో కిసక్కీ అంటూ తన ఫ్యాన్స్‌కు పూనకాలు తెప్పించింది. దీంతో మరోసారి ఈ అమ్మడు క్రేజ్ అమాంతం పెరిగింది.క మళ్లీ టాలీవుడ్‌లో వరసగా ఛాన్స్‌లు అందుకుంటూ దూసుకెళ్తుంది. ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే ఈ ముద్దుగుమ్మ, తాజాగా స్టైలిష్ లుక్‌లో ఉన్న బ్యూటిఫుల్ ఫొటోస్ షేర్ చేసింది.తాజాగా శ్రీలీల తన ఇన్ స్టాగ్రామ్‌లో స్టైలిష్ లుక్‌లో, హీటెక్కించే చూపులతో, గ్లామర్ డోస్ పెంచి, అదిరిపోయే స్టిల్స్ ఇస్తూ ఫొటోలకు ఫోజులిచ్చింది. ట్రెండీ వేర్‌లో తన క్యూట్ లుక్స్‌తో అందరినీ ఆకట్టుకుంటుంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోస్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.







## రామ్‌చరణ్ పెద్ది' ఫస్ట్ సింగిల్.. 'చికిరి చికిరి' వచ్చేసింది.

టాలీవుడ్ అగ్ర కథానాయకుడు రామ్‌చరణ్ టైటిల్ పాత్రలో నటిస్తున్న చిత్రం పెద్ది. ఈ సినిమాకు బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తుండగా.. వృద్ధి సినిమాస్ నిర్మిస్తుంది. జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా కన్నడ నటుడు శివరాజ్ కుమార్ కీలక పాత్రలో కనిపించబోతున్నాడు. ఈ చిత్రం వచ్చే ఏడాది మార్చి 27న ప్రేక్షకుల ముందుకు రానుంది.ఈ సందర్భంగా ఇప్పటినుంచే ప్రమోషన్స్ షురూ చేసింది చిత్రయూనిట్. ఇందులో భాగంగా ఫస్ట్ సింగిల్ 'చికిరి చికిరి' పాటను విడుదల చేసింది చిత్రయూనిట్. ఏఆర్ రెహామాన్ సంగీతం అందించిన ఈ పాట ప్రస్తుతం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది.

## గుడ్‌న్యూస్.. పండంటి బిడ్డకు జన్మనిచ్చిన కత్రినాకైఫ్



బాలీవుడ్ స్టార్ కపుల్స్ కత్రినాకైఫ్-విక్కీ కౌషల్ గుడ్‌న్యూస్ చెప్పారు. పెండ్లైన నాలుగేండ్లకు తల్లిదండ్రులయ్యారు. కత్రినా పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఈ విషయాన్ని ఈ స్టార్ జంట సోషల్ మీడియా ద్వారా శుక్రవారం అధికారికంగా ప్రకటించారు. ఈ పోస్ట్ ప్రస్తుతం వైరల్ అవుతోంది.విక్కీ కౌశల్ కత్రినా కైఫ్.. 2021 డిసెంబర్ 9న రాజస్థాన్‌లో వివాహ బంధంతో ఒక్కటైన విషయం తెలిసిందే. అప్పటి నుంచి కత్రినా తల్లి కానున్నట్లు ఎన్నోసార్లు వార్తలు వచ్చాయి. ఇక ఈ ఏడాది సెప్టెంబర్ 23న తాము తల్లిదండ్రులం కాబోతున్నట్లు ఈ జంట ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు బేబీ బంప్‌తో ఉన్న ఫొటోను కత్రినా తన ఇన్‌స్టాలో పోస్ట్ చేసింది. 'ఆనందం నిండిన హృదయాలతో మా జీవితంలోని కొత్త అధ్యాయాన్ని ప్రారంభించబోతున్నాం' అంటూ ప్రకటించింది. ఇప్పుడు పండండి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఈ విషయం తెలుసుకున్న అభిమానులు, నెటిజన్లు, సెలబ్రిటీలు.. కత్రినా-విక్కీ జంటకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.



## అనసూయ త్రీసమ్ రొమాంటిక్ సాంగ్!?

ఒక్కసారిగా అనసూయ మళ్ళీ హాట్ టాపిక్ అయింది. అందుకు ప్రధాన కారణం ఓ వీడియో సాంగ్. ప్రభుదేవా, రాయ్ లక్ష్మీ, అనసూయ భరద్వాజ్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'వోల్ఫ్' మళ్లీ వార్తల్లో నిలిచింది. 2023 ఆగస్టులో టీజర్‌ను విడుదల చేసిన ఈ చిత్ర బృందం, ఇన్నాళ్ల విరామం తర్వాత తాజాగా ఓ కొత్త అప్డేట్ ఇచ్చింది. తాజాగా విడుదలైన "సాసా సాసా" అనే తమిళ లిరికల్ వీడియో సాంగ్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.ఈ పాటలో ప్రభుదేవా తన సొగసైన డ్యాన్స్ మూవ్స్‌తో ఆకట్టుకుంటూ కనిపిస్తారు. ఓ ఇంట్లో ఒంటరిగా ఉన్న హీరో జీవితంలో ముగ్గురు అందమైన యువతులు ఒక్కొక్కరిగా ప్రవేశించడం, వారంతా చాటుగా మొబైల్‌లో వీడియోలు తీయడం, హీరోను ఆటపట్టించడం వంటి రొమాంటిక్ సన్నివేశాల మధ్య ఈ పాట సాగుతుంది. మెలోడీకి తోడు స్టైలిష్ విజువల్స్, ప్రభుదేవా ఎనర్జిటిక్ డ్యాన్స్ ఫ్యాన్స్‌కి స్పెషల్ ట్రీట్‌గా మారాయి. ఇప్పటికే ఈ త్రీసమ్ రొమాంటిక్ సాంగ్ యువతలో విపరీతంగా వైరల్ అవుతోంది. ప్రెజెంటేషన్‌లో ఉన్న క్లాస్ టచ్, సంగీతంలో ఉన్న మోడర్న్ బీట్‌లు ప్రేక్షకులను ఆకర్షిస్తున్నాయి. అయితే అనసూయ భరద్వాజ్ ఇలాంటి సాంగ్‌లో నటించడం కొంతమందిని ఆశ్చర్యపరిచింది. ఆమె ఓ తాంత్రికురాలి పాత్రలో కనిపించబోతున్నారని, ఆ రోల్ హర్రర్ రోమాన్స్ మిక్స్‌గా ఉంటుందని సమాచారం. అయినా, నెటిజన్లు "ఇలాంటి పాత్రలో అనసూయ ఎందుకు నటించింది?" అంటూ సోషల్ మీడియాలో విభిన్న కామెంట్లు చేస్తున్నారు. కొంతమంది ఆమెపై వ్యంగ్యంగా ట్వీట్లు చేస్తుండగా, మరికొందరు మాత్రం ఆమె కొత్త ప్రయోగాన్ని మెచ్చుకుంటున్నారు. ఏదేమైనా, "సాసా సాసా" పాటతో ఈ సినిమా మీద మళ్లీ చర్చ మొదలైంది.వినూ వెంకటేష్ దర్శకత్వంలో రూపొందిన 'వోల్ఫ్' చిత్రం ప్రభుదేవా కెరీర్‌లో 60వ సినిమాగా నిలవబోతోంది. సందేశ్ నాగరాజు, సందేశ్ ఎన్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం త్వరలోనే తమిళంతో పాటు తెలుగు మరియు ఇతర భాషల్లో విడుదల కానుంది.

Edited, printed and owned by **BHIROJU KISHORE CHARY,**printed at **SHIVA KESHAVA PRINTERS** ,FLAT NO .30, BLOCK NO.8, RAJEEVHEELS JAGATH-GIRIGUTTA QUTHBULLAPUR, MEDCHAL,(MALKAJGIRI)editor BHIROJU KISHORE CHARY,RNI Regn No TELTEL 2021/81472